# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 45 సంచిక : 13 విజయవాడ 5-11-2012 పేజీలు : 8 వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


- పాకిస్థాన్‌లో భగత్‌సింగ్ స్మారక చిహ్నం
- సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో అర్థఫ్యూడల్, అర్థవలస సామాజిక వ్యవస్థ ప్రాసంగికత –డా॥ గోలక్ బీహారీ నాథ్
- పాలకుల 'విడతల వారీ భూ పంపిణీ' ఓ మాటల గారడి
- కామ్రేడ్ ఘంటా సీతారామయ్యగారికి జోహార్లు!
- తమిళనాడు : కామ్రేడ్ పళనిని హత్యచేసిన భూస్వామ్య పెత్తందారులు


# కార్పోరేటు సాగుకు అనుకూలంగా రైతాంగానికి రుణపరపతిని తగ్గించిన ప్రభుత్వం

**నూతన** ఆర్థిక విధానాలతో భారత ప్రభుత్వం రైతాంగానికి సాగును లాభసాటి కాని కార్యంగా మార్చివేసింది. సాగుకు అవసరమైన అన్ని ఉత్పాదకాల ధరలనూ పెంచివేసి రైతాంగంపై భారం పెంచింది. పంటల మార్కెట్టుపై నియంత్రణను ఎత్తివేసి, ప్రభుత్వ సేకరణ సంస్థలను రంగంనుండి తప్పించి, రైతాంగానికి తాను ప్రకటించిన కనీస మద్దతు ధరను గరిష్ట కొనుగోలు ధరగా మార్చింది. ఫలితంగా పేద, మధ్యతరగతి రైతాంగం తమ ఆస్తుల విలువను మించి అప్పుల పాలయ్యేట్లు చేసింది. ఈ విధానాలన్నీ ప్రపంచ మార్కెట్టు ధరలను రైతాంగానికి అందేట్లు చేయటానికేనని ఊదరగొట్టి చేసింది. కాగా రెండున్నర లక్షలమంది రైతాంగం అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. దీనికి రెట్టింపు సంఖ్యలో రైతాంగం భూములను కోల్పోయారు.

ఈ సంక్షోభానికి పంటల దిగుబడులు పెరగకపోవటమే కారణంగా చూపెడుతూ, దిగుబడులు పెంచేందుకు యాంత్రీకరణ, జన్యుమార్పిడి విత్తనాలు, పంటల నిల్వకు ఆధునిక పద్ధతులు అనుసరించమని చెబుతున్నది. వీటిని పాటించటానికి రైతాంగం భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వుంటుంది. 80శాతం రైతాంగం 5 ఎకరాలలోపు కలిగిన పేద, మధ్యతరగతి వారు కావటంతో వారికి ఈ స్థాయి పెట్టుబడి సాధ్యంకాదని పాలకులకు తెలుసు. పెద్ద కంపెనీలకు బంధిత ఉత్పత్తిదారులుగా రైతాంగాన్ని మార్చే కాంట్రాక్టు /కార్పోరేటు సాగుకు రైతాంగాన్ని అంగీకరింపజేసేందుకే పాలకవర్గాలు ఈ విధానాన్ని అనుసరించాయి.

ఇప్పుడు రెండవ పైరుపచ్చ విప్లవాన్ని ప్రారంభిస్తున్నానంటూ కార్పోరేటు సాగుకు అనుకూలంగా అనేక చర్యలను వరుసగా తీసుకుంటున్నది. చిల్లర వ్యాపారంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించింది. మార్కెట్టు యార్డుల పర్యవేక్షణ లేకుండా, ఈ విదేశీ కంపెనీలు రైతాంగంనుండి పంటను కొనుగోలు చేసేందుకు అనుమతించింది. ఈ కంపెనీలు భూములు కొనుగోలు, కౌలుకు తీసుకోవటాన్ని సులభతరం చేసేందుకు భూమి రికార్డులను కంప్యూటరీకరించేందుకూ, తద్వారా భూమి కొనుగోలును దేశంలో ఎక్కడైనా రిజిష్టరు చేసుకునేందుకూ ప్రపంచ బ్యాంకు నిధులతో పథకాన్ని అమలుజరుపుతున్నది. విత్తనాలను విదేశీ కంపెనీల పరంచేసింది. ఎరువుల ధరల నియంత్రణను పూర్తిగా ఎత్తివేసింది. కార్పోరేటు సాగును త్వరగానూ, సులభంగానూ అమలుజరపగల చక్కెర రంగంలో రైతాంగానికి ఎలాంటి రక్షణలూ లేకుండా, చక్కెర మిల్లులపై అన్ని నియంత్రణలూ ఎత్తివేయటానికి రంగరాజన్ కమిటీ నివేదికతో రంగాన్ని సిద్ధంచేసింది.

చడీచప్పుడూ లేకుండా రైతాంగానికుద్దేశించిన సంస్థాగత రుణసౌకర్యాన్ని కూడా దేశ, విదేశీ కంపెనీలకు కట్టబెట్టేందుకు చర్యలు తీసుకుంటూ వస్తున్నది. అవేమిటో చూద్దాం.

వాణిజ్య బ్యాంకులు తాము యిస్తున్న మొత్తం రుణాలలో 9శాతం ప్రాధాన్యతా రంగంగా వ్యవసాయ రంగానికివ్వాలి. దీనిని తప్పని షరతుగా పాటించాల్సివున్నా వాణిజ్యబ్యాంకులేనాడూ లక్ష్యాల మేరకు రైతాంగానికి రుణాలు అందజేయలేదు. అందించిన మేరకు కూడా అవి రైతాంగపు రుణ అవసరాలలో 20 శాతాన్ని మించి ఏనాడూ తీర్చలేదు. మిగిలిన రుణాలకోసం రైతాంగం అధిక వడ్డీలకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారు.

ప్రాధాన్యతా రంగంగా వ్యవసాయ రంగానికిచ్చే రుణాలను ప్రత్యక్ష రుణాలు(పంటరుణాలు, వ్యవసాయ పరికరాలు వగైరా) పరోక్ష రుణాలు (గోదాములు, శీతల గిడ్డంగులు, సూక్ష్మ నీటిపారుదల, మార్కెటింగ్ రుణాలు వగైరా)గా రిజర్వుబ్యాంకు నిర్వచించి చెరిసగం రుణాలివ్వాలని నిర్దేశించింది. అయితే ప్రభుత్వం వీటికిచ్చిన నిర్వచనాలను మార్చుడంద్వారా ప్రత్యక్ష రుణాలను తగ్గిస్తూ వస్తున్నది. ఉదాహరణకు, శీతల గిడ్డంగికి యిచ్చిన రుణంలో 30 శాతాన్ని ప్రత్యక్ష రుణంగా పరిగణిస్తానని చెప్పింది. అలాగే ప్లాంటేషన్లు, పూలతోటలకిచ్చే రుణంలో సగాన్ని ప్రత్యక్ష రుణంగా లెక్కిస్తానని చెప్పింది. దీని ఫలితంగా పేద, మధ్యతరగతి రైతాంగానికి చెందవలసిన పంటరుణాలు శీతల గిడ్డంగులకు, ప్లాంటేషన్లకూ తరలిపోయాయి. ఇది వట్టి ఆరోపణ కాదు. ఎంత పెద్దస్థాయిలో ఈ తరలింపు జరిగిందో గమనించండి.

యుపిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి రుణాలు బాగా పెరిగాయి. దాదాపు 2 లక్షల 20వేల కోట్ల రూ॥ల నుండి 4 లక్షల 20వేల కోట్లకు పెరిగాయి. ఇదంతా రైతాంగానికే అందిందా? మొత్తం వ్యవసాయానికి యిచ్చిన బ్యాంకు రుణాలలో 1990లో ప్రత్యక్ష రుణాలు 86.8 శాతముండగా, 2009 నాటికి 77 శాతానికి తగ్గిపోయాయి. కాగా పరోక్ష రుణాలు 13 శాతంనుండి 23 శాతానికి పెరిగాయి.

ఈ రుణాలు పొందుతున్న బ్యాంకు ఖాతాలలో రూ॥2 లక్షల లోపు రుణాలు పొందిన ఖాతాలు 1990లో 82.6 శాతముండగా, 2009 నాటికి 44.3 శాతానికి తగ్గిపోయాయి. ఎకరానికిచ్చే పంట రుణం దాదాపుగా 20వేల వరకూ వుంటుంది గనుక ఈ ఖాతాలన్నీ 10 ఎకరాల లోపు రైతులకే చెందివుంటాయి. అంటే చిన్న, మధ్యతరగతి రైతాంగానికిస్తున్న పంట రుణాలు బాగా తగ్గిపోయాయని అర్థం.

కాగా యిదే కాలంలో(1990–2009) కోటి రూ॥లకు పైగా రుణాన్ని పొందిన ఖాతాలు 5.5 శాతం నుండి 26.7 శాతానికి, అంటే దాదాపు ఐదురెట్లు పెరిగాయి. పోనీ యిదైనా ధనిక రైతులకో, భూస్వాములకో అందిందనుకోవటానికి లేదు. ఎందుకంటే వీటిలో 25 కోట్ల రూ॥లకు పైగా రుణం పొందిన ఖాతాలే ఎక్కువ. ఈ ఖాతాల సంఖ్య 1990లో నామమాత్రం కాగా 2009లో 17.7 శాతంగా వుంది. అలాగే పరోక్ష రుణాలను చూస్తే రూ॥25 కోట్లు పొందిన వ్యవసాయ రుణఖాతాలు 62 శాతంగా వున్నాయి. దీని అర్థం ఒక్కటే. వ్యవసాయరంగంలోకి దేశ, విదేశీ కంపెనీలు ప్రత్యక్షంగా చొరబడేందుకు ముందుగా, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించుకునేందుకు వాటికి రుణ సదుపాయాన్ని రైతాంగం పేరిట పెంచుకుంటూ పోయారు. రైతాంగానికి రుణాలను తగ్గించివేశారు. ఈ గణాంకాలన్నీ రిజర్వుబ్యాంకు వార్షిక నివేదికలలో వున్నవే.

ఈ తరలింపును మరింత వేగంగా పెద్దస్థాయిలో సాగించడానికి కేంద్రప్రభుత్వం పూనుకుంది. వాణిజ్య బ్యాంకులకు జారీచేసిన ఒక సర్క్యులర్‌లో రిజర్వుబ్యాంకు ఇలా స్పష్టంచేసింది:

సాగు కార్యకలాపాలలో ప్రత్యక్షంగా పాల్గొంటున్న కార్పోరేట్లకూ, భాగస్వామ్య ప్రైవేటు కంపెనీలకూ, రైతులు ఏర్పాటు చేసుకున్న కంపెనీలతో సహా రైతుల సాగు సహకార సంఘాలకూ ఇచ్చే రుణాలను ప్రాధాన్యతా రంగ రుణాలుగా పరిగణించబడతాయి. వాటికి గరిష్ట పరిమితి రూ॥2 కోట్లు. వాటిని పంట రుణాలుగా,

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

# ప్రజాసమస్యలు పట్టని పాదయాత్రల సంరంభం

**ప్రజల** జీవన సమస్యలు నానాటికీ తీవ్రమౌతున్నాయి. విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం పూర్తయినా సహజవాయువు అందక మూలనపడి వుండగా, రాష్ట్రంలో విద్యుత్తు కొరత తీవ్రస్థాయికి చేరింది. గ్రామాలలో 12నుండి 16 గంటలూ, పట్టణాలలో 8 గంటలూ విద్యుత్తు కొరతతో రాష్ట్రం అంధకారంలో మునిగివుంది. విద్యుత్తు కొరతతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడుతున్నాయి. వాటిలో అనేకం తిరిగి కోలుకోలేని రీతిలో ఖాయిలా పడ్డాయి. ఫలితంగా లక్షలాది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. కిరాణా, చిల్లర అమ్మకం దుకాణాలు కూడా వ్యాపారాలు సాగించుకోలేని స్థితి ఏర్పడింది. వ్యవసాయానికి 7 గంటల నిరంతరాయ విద్యుత్తు సరఫరా కూడా అస్తవ్యస్తంగా వుంది. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలీక రైతాంగం పొలాలలోనే కాలం గడుపుతున్నారు. అనావృష్టిలో కూడా కష్టించి వేసిన పంటలు ఎండిపోతుంటే రైతాంగం కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వాధికారుల ప్రకటనల ప్రకారం ఈ పరిస్థితి సమీప భవిష్యత్తులో ఏమాత్రం మెరుగుపడదనీ, దానికోసం తీసుకున్న చర్యలేవీ లేవనీ స్పష్టంగానే అర్థమౌతున్నది. కేజిబేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజవాయువును పొందేందుకు రాష్ట్రప్రభుత్వం ఏ ప్రయత్నాలూ చేయటంలేదు. కాగా సహజవాయువు ధరను ప్రస్తుత యూనిటుకు 4.25 డాలర్లనుండి 13 డాలర్లకు పెంచమని రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తెస్తున్న ఒత్తిడికి లొంగిన కేంద్రప్రభుత్వం సీనియర్ మంత్రి జైపాల్‌రెడ్డిని ఆశాఖ నుండి తప్పించింది. దీనిని నిరసించవలసిందిపోయి, రాష్ట్ర కాంగ్రెసు నాయకులు, రాష్ట్ర ఎంపిలు 10 మందికి మంత్రి పదవులు కట్టబెట్టినందుకు సోనియాగాంధి ఉదారత్వాన్ని పొగడటంలో మునిగిపోయారు.

నైరుతీ రుతుపవనాల రాక ఆలశ్యమై బలహీనంగా వుండటంతో, 25 శాతం భూమిలో నాట్లు పడలేదు. గోదావరి, కృష్ణా నదుల డెల్టాకు సాగునీటిని తక్కువగా, ఆలస్యంగా అందించారు. నాగార్జునసాగర్, కెసికెనాల్, పోచంపాడు ప్రాజెక్టుల ఆయకట్టుకు ఇంతవరకూ నీరందించలేదు. దీనితో నానా తిప్పలూ పడి నాట్లువేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయి. మరోవైపున ప్రత్తిపంట మార్కెట్టులోకి రావటం మొదలైంది. నవంబరు మధ్యనాటికి వరిపంట మార్కెట్టుకు రావటం మొదలవుతుంది. అయినా రైతాంగానికి కనీస మద్దతుధర అందించటానికైనా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. రాష్ట్ర కొనుగోలు సంస్థలు రంగంలోకి దిగి కొనుగోలు ప్రారంభిస్తాయన్న మంత్రుల ప్రకటనలేతప్ప ఆచరణలో అవెక్కడా కన్పించటంలేదు. కొనుగోలు సంస్థలు వచ్చేవరకూ పంటను అమ్ముకోవద్దని ప్రభుత్వం రైతాంగానికి ఉచిత సలహాలిస్తున్నది. పెట్టుబడులకోసం అప్పులు చేసిన రైతాంగం పంటను కళ్ళాలలోనే తెగనమ్ముకోవాల్సిన స్థితిలోనే వున్నారు. వ్యాపారులు ధరలు దిగ్గోయటంతో ప్రత్తి రైతాంగం అదిలాబాదు మార్కెట్టు యార్డులో షాపులు ధ్వంసంచేసి జాతీయ రహదారిని స్థంభింపచేసినా వారి గోడు పట్టించుకోవాల్సిన జిల్లా అధికారులుగానీ, ఎన్నికయిన ప్రతినిధులుగానీ ఆ చుట్టుప్రక్కల కన్పించలేదు. పంటను తిరిగి యింటికి తీసుకువెళ్లలేక రైతాంగమే వ్యాపారులిచ్చిన రేటుకు అమ్ముకోవాల్సివచ్చింది.

రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య పరిస్థితి దిగజారిపోతున్నది. మున్సిపాలిటీలు మురికి కూపాలుగా మారి వ్యాధులు ప్రబలుతున్నాయి. అతి సులభంగా నివారించగల వ్యాధులు కూడా విస్తరించి ప్రజల ప్రాణాలు హరించివేస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులు నిధులులేక, వైద్యులు, సిబ్బందిలేక కునారిల్లుపోతున్నాయి. ప్రైవేటు వైద్యానికి పేదలు ఆస్తులు అమ్ముకుంటుండగా, మధ్యతరగతులు అప్పులపాలవుతున్నారు. అయినా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకపోగా, ప్రభుత్వ ఉద్యోగుల వైద్యఖర్చులు చెల్లించే పథకం స్థానంలో కొన్ని వ్యాధులకు మాత్రమే ఇన్సూరెన్సు పథకాన్ని పెట్టింది.

ప్రాథమిక, మాధ్యమిక విద్యను ప్రైవేటీకరించిన ప్రభుత్వం, ఇప్పుడు ఉన్నత విద్యను కూడా పూర్తిగా ప్రైవేటీకరించేందుకు పూనుకుంది. గత ఐదేళ్లలో జిల్లాకొక విశ్వవిద్యాలయాన్ని పెట్టిన ప్రభుత్వం, వాటికి తగినన్ని నిధులు మంజూరు చేయకుండా సెల్ఫ్ ఫైనాన్సు కోర్సుల పేరిట ఫీజులను మాత్రం విపరీతంగా పెంచివేసింది. అన్ని విశ్వవిద్యాలయాలు–వుండవలసిన వారిలో 50శాతం మంది బోధన, బోధనేతర సిబ్బందితోనే నడుస్తున్నాయి. సాంకేతిక విద్యను లాభాలు పిండుకునే వనరుగా మార్చటంతో అస్తవ్యస్థమైంది. నాణ్యమైన విద్యను సరసమైన ఖర్చుకు అందిస్తామన్న పేరిట ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు ఇబ్బడిముబ్బడిగా అనుమతించింది. దీనితో సాంకేతిక విద్యాప్రమాణాలు దిగజారిపోయాయి. రాష్ట్రంలో ఇంజనీరింగు డిగ్రీ పొందిన వారిలో 10శాతం మంది మాత్రమే ఉపాధి పొందగల నైపుణ్యాన్ని కలిగివున్నారని ప్రభుత్వ సర్వేనే తేల్చిచెప్పింది. ఏ ఉపాధీ చూపని డిగ్రీ కోసం లక్షలు వెచ్చించాల్సిన దుస్థితిలోకి నెట్టింది. కనీసం పాలిటెక్నిక్ డిప్లమా పొందిన వారికైనా కొంత ఉపాధి లభ్యమవుతున్నదనుకుంటుంటే, వాటిని ఇంజనీరింగు కాలేజీల స్థాయికి పెంచుతామన్న మంత్రివర్యుల ప్రకటన ఎంతదిగజారుస్తారోనన్న భయాన్ని కలిగిస్తున్నది.

గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలనుసరిస్తూ వచ్చిన విధానాల ఫలితంగా సృష్టించబడ్డ సమస్యలకు ప్రజలను ఎరగావేసి, రాష్ట్రంలోని పాలకవర్గ పార్టీలత్రయం (కాంగ్రెసు, టిడిపి, వైఎస్ఆర్‌సిపి) పాదయాత్ర సంరంభంలో మునిగిపోయాయి. పట్టాలు, రేషను కార్డుల పంపిణీ జాతరలకు హైద్రాబాదునుండి ప్రతి జిల్లాకు హెలీకాప్టరులో ఎగిరి వస్తున్న ముఖ్యమంత్రి ఒకవైపునా, ప్రతిపక్షంలోని టిడిపి, వైఎస్ఆర్‌సిపి పార్టీలు పాదయాత్రల పేరిట మరోవైపునా అన్ని జిల్లాలలో పర్యటిస్తున్నారు.

ఈ ప్రదర్శనల్లో జుగుప్సాకర అంశమేమంటే మూడు అసెంబ్లీలలో సభ్యుడిగా వున్న ముఖ్యమంత్రి, తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పాలన సాగించిన చంద్రబాబునాయుడు ప్రజల వాస్తవ స్థితిగతులు తెలుసుకునేందుకే వారి ముందుకొస్తున్నామని చెప్పటం! అవేమిటో తెలియకుండానే ఇన్నాళ్లూ అధికారాన్ని వెళగబెట్టారన్నమాట!

(తరువాయి 2వ పేజీలో)

## తమిళనాడు

# కా॥ పళనిని హత్యచేసిన భూస్వామ్య పెత్తందారులు

12-9-12న నాయకన్‌కొట్టైలో అమరులు కామ్రేడ్స్ బేలార్, అప్పుల స్మారకస్థూపంవద్ద నివాళులు



**తాళ్లి** నియోజకవర్గ ఎంఎల్ఏ రామచంద్రన్ పంపిన కిరాయి గూండాలు 5-7-2012న కా॥ పళనిని హత్యచేశారు. కా॥ పలని, పెరియార్ ద్రవిడ కజగం సభ్యుడు. సిపిఐ(ఎం.ఎల్), పెరియార్ ద్రవిడ కజగం, కొన్ని దళిత పార్టీలూ కలిసి రామచంద్రన్ దురాగతాలపై పోరాడుతున్నాయి.

సిపిఐ టిక్కెట్టుపై గెలిచిన ఎంఎల్ఏగా చెప్పుకుంటున్న రామచంద్రన్ కృష్ణగిరి జిల్లాలో ఒక భూస్వామి. వేలాది ఎకరాల భూమికలిగి వున్నాడు, గ్రానైట్ గనులు, స్టోన్‌క్వారీలు, అనేక క్రషర్లు ఇతని ఆధీనంలో వున్నాయి. ఇతను, ఇతని సోదరుడు వరదరాజన్, ఇతని మామ లగుమయ్యలు సిపిఐకి చెందిన రైతు సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు. తమ దౌర్జన్యాలను ప్రశ్నించిన వారిపై దాడులు చేయటం, హత్యలు కావించటం వీరి నైజం. ముందు నాలుగు...వెనుక నాలుగు జీవులూ, 50 మంది గూండాలూ తోడులేకుండా ఇతను బయటకు రాడు. లగుమయ్య 40 హత్యకేసుల్లో నిందితుడు.

వీరు గత ఏడాది నాగమంగళం పంచాయితీలోని మూడు గ్రామాల రైతులకు చెందిన 3000 ఎకరాలను దౌర్జన్యంతో ఆక్రమించుకున్నారు. సిపిఐ(ఎంఎల్), పెరియార్ ద్రవిడ కజగంల మద్దతుతో రైతాంగం తమ భూముల స్వాధీనం కోసం పోరాడుతున్నారు. దీనిని సహించలేని రామచంద్రన్, నీలగిరి గ్రామంపైకి కిరాయి గూండాలను ఉసికొల్పాడు. నీలగిరి రైతాంగం ఈ దాడిని నిర్మాణ యుతంగా త్రిప్పికొట్టారు. ఈ దాడి గురించి ముందస్తు సమాచారం తెలుసుకున్న కా॥ పళని, రైతాంగాన్ని హెచ్చరించి వారితోపాటు పోరాటంలో పాల్గొన్నాడు.

దీనితో రెచ్చిపోయిన రామచంద్రన్ కిరాయి గూండాలతో క్రిష్ణగిరి జిల్లాలో సిపిఐ(ఎం-ఎల్) కార్యకర్త కా॥ కుమార్‌ను హత్య చేయించాడు. నేరస్తులను అరెస్టు చేసి శిక్షించాలన్న ఆందోళన సాగినా జిల్లా యంత్రాంగం రామచంద్రన్ కొమ్ముకాసింది. ఆక్రమించిన 3000 ఎకరాలను జిఎంఆర్ కంపెనీకి అమ్మి వేయటంలో రామచంద్రన్‌కు సహకరించింది.

కా॥ పళని వయసు 28 సంవత్సరాలు. అవివాహితుడు. మొదట సిపిఐ(ఎం-ఎల్) సభ్యుడిగా వుండి, తరువాత పిడికేలో చేరాడు. అయినా కలిసికట్టుగా పనిచేస్తున్నాడు. ఆయన హత్య ప్రజలకు ఆగ్రహాన్ని కలిగించింది. సిపిఐ (ఎం-ఎల్), పిడికేల నాయకత్వంలో ప్రజలు తీవ్ర ఆందోళన సాగించి రామచంద్రన్ దౌర్జన్యాలను తూర్పారా పట్టారు. ఇది మీడియాలో ప్రముఖంగా నచ్చింది. దీనితో పోలీసులు రామచంద్రన్‌పై కేసు పెట్టారు. అతనితోపాటు వరదరాజన్, లగుమయ్యలతో సహా 20 మందిపై 10 కేసులు పెట్టి తమిళనాడు గూండా చట్టం 1982 క్రింద అరెస్టు చేశారు. ప్రభుత్వం...పోలీసు సూపరింటెండెంటు అభిషేక్ దీక్షిత్‌ను సస్పెండ్ చేసింది. జిల్లా కలెక్టరును బదిలీ చేసింది.

సిపిఐ(ఎం-ఎల్), పిడికే, దళిత్ లిబరేషన్ పార్టీలు సంయుక్తంగా నాగమంగళం పంచాయితీలో వీధి సమావేశాలు జరిపాయి. రాయకోట్టై, తాళ్లి, బెరికాయ్, దెర్కనీకొట్టై, షంతూర్, చెన్నై ఎంజిఆర్‌నగర్, కోయంబత్తూర్‌లలో బహిరంగ సభలు జరిపాయి. 12-9-2012న ధర్మపురి దగ్గరలోని నాయకన్‌కొట్టైలో అమరులు బేలార్, అప్పుల సంస్మరణలో నిర్మించిన స్థూపంవద్ద అమరుల సంస్మరణ దినాన్ని జరిపాయి.

ఈ సభలన్నింటా ప్రసంగించిన నాయకులు ఎంఎల్ఏ రామచంద్రన్ సాగిస్తున్న దురాగతాలను ఎండగట్టారు. రామచంద్రన్‌ను సిపిఐ నుండి బహిష్కరించాలని సిపిఐ నాయకత్వాన్ని డిమాండు చేశారు. ✡

---

## కార్పొరేటుసాగు... (మొదటి పేజీ తరువాయి)

కోతలకు ముందూ, తర్వాత పనులకూ యివ్వాలి. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు (పాడి, కోళ్లు, తేనెటీగలు, పట్టుపురుగులు, పశుపెంపకం) ఇచ్చే రుణాలు కూడా వ్యవసాయరంగ రుణాలుగా పరిగణించబడతాయి. దేశంలో 20 శాఖలకు పైగా వున్న విదేశీ బ్యాంకులు కూడా 2013 ఏప్రిల్ నుండి 2018 ఏప్రిల్‌లోపు ఐదేళ్ళలోగా ఈ నిబంధనలను పాటించి ప్రాధాన్యతారంగ రుణ లక్ష్యాలను సాధించాలి *(వివరాలు:ఇకనామిక్ టైమ్స్ 13-10-2012 నుండి)*

ఇక్కడ విషయం స్పష్టంగానే వుంది. వ్యవసాయ రుణాలపేరిట, మౌలిక సదుపాయాలు కల్పించు కునేందుకు కంపెనీలకు ఇన్నాళ్లూ రుణవితరణ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ కంపెనీలు ప్రత్యక్షంగా సాగులోకి దిగటానికి రుణవితరణ చేయటానికి పూనుకుంది. రెండు కోట్ల గరిష్ట పరిమితి మరో సర్క్యులర్‌లో పెంచుకుంటూపోవచ్చు. అనుబంధ కార్యకలాపాలలో ఇప్పటికే పౌల్ట్రీ, కాంట్రాక్టు సాగుస్థాయికి చేరింది. ఇక కోళ్ల మేతకు మొక్కజొన్న వంటి పంటలను ఆ పరిధిలోకి తీసుకువస్తారు. ఇది దేశీకంపెనీలకే కాక విదేశీ కంపెనీలకు అనుగుణంగా విదేశీ బ్యాంకులకు కూడా అనుమతించారు. ఇన్నాళ్లూ ఈ విదేశీ బ్యాంకులు నగరాలకే పరిమిత మయ్యాయి. తమ కంపెనీలు సాగులోకి ప్రవేశిస్తే, వాటి వెనుకే ఈ బ్యాంకులూ వస్తాయి. లక్ష్యాలు సాధించమని రిజర్వుబ్యాంకు వాటికిచ్చిన ఆదేశం, వాస్తవానికి వ్యవసాయరంగంలో విస్తరించేందుకు యిచ్చిన అనుమతే.

ఈ రుణ వితరణనంతా రైతాంగానికే చేస్తున్నట్లు ప్రచారం చేసుకోవటమేకాకుండా, దీనినుండి రైతాంగం దృష్టి మరల్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటిమాటికి రైతాంగ రుణాలపై వడ్డీలో కొంతభాగాన్ని తాము చెల్లిస్తామంటూ ప్రకటిస్తున్నాయి. సాగుకోసం ద్రవ్య మదుపు అవసరాలు పెరిగిపోతూ, వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోతున్న రైతాంగానికి రుణాల అందిపు పెంచవలసివుండగా, ఒకవైపున రుణాలను తగ్గించివేస్తూ, మరో వైపున వడ్డీతగ్గింపు గురించి ఊరించటం భారత పాలకవర్గాలు ప్రజలను వంచించే కళలో ఎంత ఆరితేరాయో తెల్పుతుంది. ఆచరణలో ఈ వడ్డీ తగ్గింపును కంపెనీల కిచ్చిన రుణాలకు వర్తింపజేసినా ఆశ్చర్యపడాల్సినదేమీ లేదు.

"జనశక్తి" గతం నుండి హెచ్చరిస్తూ వస్తున్నట్లుగానే ఈ విధానం తీవ్రపరిణామాలకు దారితీస్తుంది. భారత రైతాంగం విదేశీ కంపెనీలకు బంధిత ఉత్పత్తిదారులుగా దిగజార్చబడతారు. భారత వ్యవసాయరంగం విదేశీ బహుళజాతి కంపెనీల వాణిజ్య ప్రయోజనాలకు తోకగా మారుతుంది. దేశప్రజల అవసరాలను తీర్చేందుకు దేశపంటల సాగు జరగదు; విదేశీ కంపెనీల లాభదాహాన్ని తీర్చేందుకే సాగవుతాయి. దేశం ఆహారం కోసం సామ్రాజ్యవాదులపై ఆధారపడాల్సివస్తుంది.

ఇన్ని విధాలుగా విపత్కర పరిణామాలకు దారితీసే కార్పొరేటు సాగును దేశంపై రుద్దుతున్న దళారీ పాలకవర్గాల విధానాలను రైతాంగం, కార్మికులు, ప్రజలు ఎదిర్చిపోరాడాలి! ✡

---



# విశ్వాసాలు తప్పని, నడకమార్చని కా॥ ఘంటా సీతారామయ్యగార్కి అరుణారుణ జోహార్లు

**సమాజాభివృద్ధిలో** తనదైన ఒకపాత్ర నిర్వహించాలని అనుకున్న కొద్దికాలంలోనే కమ్యూనిస్టుగామారి చివరివరకూ సిపిఐ(ఎం-ఎల్) సభ్యునిగానూ, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) గుంటూరుజిల్లా గౌరవాధ్యక్షులుగానూ కొనసాగిన కా॥ ఘంటా సీతారామయ్యగారు (96 సం॥లు) 30-10-12న ఉదయం 9-40 ని॥లకు తన కుమారుడైన డా॥ వెంకట్రావు వైద్యశాల(వరంగల్)లో మరణించారు.

కా॥ ఘంటా సీతారామయ్యగారు తన మరణానికి రెండు, మూడు సం॥ల ముందువరకూ ప్రజలమధ్య చురుకైన జీవితాన్ని గడిపారు. రాజకీయపరమైన, ఉద్యమపరమైన కార్యకలాపాల మధ్య జీవితాన్ని కొనసాగించారు.

1917లో జన్మించి, స్వగ్రామమైన గూడవల్లిలోనే విద్యాభ్యాసం చేశారు. అక్కడే ఉపాధ్యాయ వృత్తి నెంచుకొని కొద్ది సం॥లు ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కాలంలో సామాజిక అసమానతలను తర్కిస్తూ సంస్కరణల అభిలాషను ఏర్పరచుకొన్నారు. త్రిపురనేని రామస్వామిచౌదరి సాహిత్య అధ్యయనంతో హేతువాద దృష్టిని ఏర్పరచుకున్నారు. సామాజిక మార్పు స్వతంత్ర వ్యవస్థలోనే సాధ్యమని తలచి గ్రామంలోని యువకులనేకమందితో కలసి స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తిని వదలి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం విధించిన జైలుశిక్షననుభవించి బయటకొచ్చినవెంటనే పార్టీ సభ్యత్వం స్వీకరించి కార్యకర్తగా మారారు.

కా॥ కస్తూరి కుటుంబరావుగారితో కలిసి గ్రంథాలయోద్యమ కార్యకలాపాలనూ, చేనేత కార్మికులను కూడగట్టి సంఘాన్ని నిర్మించే కార్యకలాపాలలోనూ, వృత్తి సమస్యలు పరిష్కరించే ఆందోళనల్లోనూ భాగం పంచుకున్నారు.

1944 ప్రాంతంలో గ్రామంలోని విద్యాభిలాష కలిగిన అనేకమందితో కలిసి ఉన్నతపాఠశాల ఏర్పరిచారు. ఉన్నతపాఠశాల వ్యవస్థాపక కమిటి సభ్యులుగా చివరివరకూకొనసాగారు.

అదే కాలంలో ఏర్పడిన సహకార సంఘానికి వరుసగా రెండుమార్లు అధ్యక్షునిగా ఎన్నికయ్యి, దాని బాధ్యతలు నిర్వహించారు. యుద్ధకాలంలో, కరువుకాలంలో బండిపట్టాలు, బట్టలు, చక్కెర, పిండి మరికొన్ని నిత్యావసరాలను చౌకగానూ, అందుబాటులోనూ ఉంచే ఏర్పాటుకు దోహదపడ్డారు.

కులాంతర వివాహాలు జరపటానికి, సంస్కరణల పద్ధతిలో వివాహాలు జరిపించటానికి ముందునిలిచారు. హరిజనులపై (దళితులపై) కమ్మకుల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ పరంగా గట్టిగా నిలిచారు. అలాగే వేతనాల పెంపుదలకోసం, స్త్రీ, పురుష వేతనాలలో వ్యత్యాసానికి వ్యతిరేకంగా మరికొన్ని సమస్యల పరిష్కార కోసం సాగిన వ్యవసాయ కార్మిక పోరాటాలన్నింటికీ ముందుపీఠిన నిలిచారు. ఇలాంటి కృషిలోనూ, కార్యకలాపాలలోనూ పాల్గొంటున్నందుకు పెత్తందారులు కులాన్ని ప్రయోగించి వెలివేయటానికి పూనుకోగా, సీతారామయ్యగారు గౌడలు, చాకళ్ళు, వెనుకబడిన కులాలుండే ప్రాంతంలో తమ ఇంటిని ఏర్పరచుకున్నారు. అక్కడే చివరివరకూ నివాసమున్నారు.

1953, 1956లలో జరిగిన పంచాయితీ ఎన్నికలలో ప్రెసిడెంటుగా ఎన్నికయ్యారు. రెండుసార్లు 'బెస్ట్‌పంచాయితీ'గా గ్రామానికి గుర్తింపు తెచ్చారు.

1946 ఎన్నికల్లోనూ, 1952,1955,1957,1962, 1967లలో జరిగిన పార్లమెంటు, శాసనసభల ఎన్నికలలో పెత్తందారీ వర్గాలను ఎదుర్కోని, పీడిత ప్రజలను సంఘటిత పరిచి, నిలబెట్టటానికి కృషిసాగించారు.

కమ్యూనిస్టు ఆర్గనైజర్‌గా వుంటూ '50లలో భట్టిప్రోలు బ్లాక్ పార్టీసమితి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. సుదీర్ఘకాలం జిల్లాస్థాయి కమిటీలో సభ్యులుగా వుంటూ బాధ్యతలు నిర్వహించారు.

1942, 1948-50లలో, 1964లోనూ వచ్చిన నిర్బంధాలను ఎదుర్కొంటూ రహస్యంగా ప్రజలమధ్య వుంటూ ప్రజా కార్యకలాపాలు, నిర్మాణ కార్యకలాపాలు నిర్వహించారు. పట్టుబడిన తదనంతరం నిబ్బరంగా జైలు జీవితాన్ని గడిపారు కా॥ తరిమెల నాగిరెడ్డి తదితరులపై మోపిన కుట్రకేసులో తనకుమారుడైన డా॥ వెంకట్రావును, కోడలు మారుతిని నిర్బంధించినపుడు అదే నిబ్బరాన్ని ప్రదర్శించారు.

రహస్యకాలంలోనూ, నిర్బంధ కాలంలోనూ కుటుంబంలో ఎదురైన కష్టాల కారణంగా నిబ్బరాన్ని కోల్పోకుండా లక్ష్యం కొరకు నిలిచారు. కార్యకలాపాలు కుంటుపడకుండా సాగించారు.

1964 నాటి కమ్యూనిస్టు ఉద్యమ చీలికలో సిపిఎం వైపు, 1968 చీలికలో కమ్యూనిస్టు విప్లవకారులపై వుండి బాధ్యతలు నిర్వహించారు. కమ్యూనిస్టు విప్లవకారుల నిర్మాణాల్లో ఉంటూ చివరివరకూ గ్రామ ప్రజల సమస్యలపైన, ఆయాప్రాంతాల్లో సాగుతున్న ప్రజాసమస్యలపై ఆందోళనల్లోనూ, పార్టీ కార్యకలాపాల్లోనూ చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. కా॥ తరిమెల నాగిరెడ్డి కన్వీనర్‌గా ఏర్పడిన కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ కాలం నుండి ఆ నిర్మాణంలో కొనసాగుతూ వచ్చారు. మరణించే నాటికి సిపిఐ(ఎం-ఎల్) సభ్యులుగా ఉన్నారు

ప్రపంచ దేశాలలోనూ, భారతదేశంలోనూ పీడితుల వర్గ ఉద్యమాలకు ఎదురైన సవాళ్ళు చూసి క్రుంగిపోకుండా ప్రజాఉద్యమాలను కొనసాగించటానికి, కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునర్నిర్మాణం చేసుకోవటానికి, విప్లవ సాధనకు మొక్కవోని విశ్వాసంతో నిలిచారు; సాగారు. వారికి సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి జోహార్లర్పిస్తున్నది. ✡

---

## ప్రజాసమస్యలు... (మొదటి పేజీ తరువాయి)

(అవును సప్తసముద్రాల ఆవలి నుండి వస్తున్న ఆదేశాలను అమలుజరపటానికి స్థానిక పరిస్థితుల పరిజ్ఞానమెందుకు?) మృతిచెందిన రాజశేఖరరెడ్డి, అవినీతి ఆరోపణలతో జైలుపాలైన జగన్మోహనరెడ్డిల పట్ల సానుభూతి ప్రకంపనాలను సృష్టించే ఏకైక నినాదంతో వైఎస్ఆర్‌సిపి పయనం సాగుతున్నది. కాగా తెలంగాణా ప్రత్యేకరాష్ట్ర నినాదానికి మద్దతు పలికితేతప్ప ప్రదర్శనలు సాగనివ్వమంటూ బెదిరింపులకు దిగిన టిఆర్ఎస్ మాత్రం తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు జరిగితే సమస్యలన్నీ మటుమాయమై పోతాయనటంతప్ప ప్రజల సమస్యలకు పరిష్కారం చూపటంలేదు.

ముఖ్యమంత్రి తన జిల్లా పర్యటనల్లో ప్రజలను భ్రమపెట్టే వాగ్దానాలు చేస్తుండగా, టిడిపి, వైఎస్ఆర్‌సిపి నాయకులు తమవద్దకు వచ్చి సమస్యలు చెప్పుకున్న వారిలో కొందరికి ధనసహాయం చేసి తమ ఉదారతత్వాన్ని చాటుకుంటున్నారు. రాజకీయపార్టీ నాయకుడంటే చేయాల్సిన పని-సమస్యకు కారణాలను గుర్తించటం, వీటికి సరైన పరిష్కారాన్ని చెప్పి ప్రజల మద్దతుపొంది, దానిని అమలు చెయ్యటం. కానీ ఈ నాయకులు మాత్రం దీనిని వదిలివేసి తామేదో దయార్ద్రహృదయులుగా లబ్ధప్రతిష్టులయ్యే పనిలో పడ్డారు. ఈ పాలకవర్గ పార్టీల నాయకులందరూ కూడబలుక్కున్నట్టుగా ప్రజలు పడుతున్న కష్టాల గురించి కన్నీరు కారుస్తున్నారు తప్ప, సమస్యలకుగల అసలు కారణాలను గురించి మౌనం పాటిస్తున్నారు. ప్రత్యర్థులను కారణంగా చూపి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు.

అధికారంకోసం పాలకవర్గ పార్టీల మధ్యనా, ఆయాపార్టీలలోని ముఠాలమధ్యనా సాగుతున్న ఈ కుమ్ములాటలు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడే కొలదీ మరింత తీవ్రమౌతాయి. ప్రజలను పట్టిపీడిస్తున్న సమస్యలు వీరికి పట్టవు. వాటి పరిష్కారం కొరకు ప్రజలు సంఘటితంగా పోరాడాలి. ✡

# పాకిస్థాన్‌లో భగత్‌సింగ్ స్మారక చిహ్నం

**పాకిస్తాన్‌లోని** ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీలురు దీర్ఘకాలంగా చేస్తున్న ప్రచారం, ప్రయత్నాలు ఫలించి లాహోర్ నగరంలోని 'షాద్‌మాన్ చౌక్'ను భగత్‌సింగ్‌చౌక్‌గా పేరు మార్చాలని ఆ దేశ ప్రభుత్వం నిర్ణయించింది.

1961 నుండి షాద్‌మన్‌చౌక్‌గా పిలవబడుతున్నది ఓ చారిత్రక ప్రాంతం. ఇక్కడే–సెంట్రల్ జైల్లో, వీరోచిత స్వాతంత్ర్య పోరాటయోధులు, విప్లవకారులు అయిన 'నేరానికి'గానూ బ్రిటిష్ వలసవాద పాలకులు 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరిదీశారు. 1947 వరకూ ఈ ప్రాంతం భగత్‌సింగ్ చౌక్‌గా గుర్తింపులో వుంది. కాగా, పాకిస్థాను ప్రభుత్వం 1961లో సెంట్రల్ జైలును కూలదోసి, ఆ ప్రాంతాన్ని షాద్‌మన్‌కాలనీ పేరిట ఓ నివాస ప్రాంతంగా మార్చి వేసింది. వలసవాద పాలకులచే ముగ్గురు విప్లవకారులు ఉరిశిక్షకు గురైన ప్రాంతంలో పాకిస్తాను ప్రభుత్వం షాద్‌మన్‌చౌక్ నిర్మాణం చేసింది.

పాకిస్థాన్ దేశంలోని ప్రగతిశీలురు, ప్రజాస్వామిక వాదులు సాగించిన అవిశ్రాంత ప్రచారం, ప్రయత్నాల ఫలితంగా భగత్‌సింగ్ స్మారకచిహ్నం పునరుద్ధరించ బడింది. అమరులను ఉరితీసిన ప్రాంతంలో వారంతా కొవ్వొత్తులనుంచి నివాళులర్పించేవారు. భగత్‌సింగ్ జయంతి, వర్ధంతుల సందర్భంగా ఈ ప్రాంతంలో సమీకృతులై అమరులకు ఘననివాళులర్పించేవారు. వారి మాటలు, ప్లకార్డులు, ప్రచారమంతటిద్వారా ఈ ప్రాంతాన్ని భగత్‌సింగ్‌చౌక్‌గా బాగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. అధికారులకు పలుమార్లు విజ్ఞాపనలు చేయటంతో పాటుగా, తమ డిమాండ్‌కు మద్దతుగా చర్యలు తీసుకోవలసిందిగా న్యాయస్థానంలోనూ పోరాడారు.

భగత్‌సింగ్ ఒక ప్రసిద్ధ దేశభక్తుడు, విప్లవకారుడు. వలసవాదులనుండి విముక్తిపొంది స్వాతంత్ర్యం పొందేందుకు తీవ్రవాద చర్యలను ఒక విధానంగా తన రాజకీయ జీవిత ప్రారంభంలో కొంతకాలం భగత్‌సింగ్ విశ్వసించాడు. కానీ అతికొద్ది కాలంలో ఆయన ఈ విధానాలను తిరస్కరించి, మార్క్సిజం–లెనినిజాలను, సోషలిజాన్ని, ప్రజావిప్లవ పంథాను స్వీకరించాడు. ఆయన తన చివరిశ్వాస వరకూ దీనికే కట్టుబడి వున్నాడు. గాంధీ మరియు భారత జాతీయ కాంగ్రెసుల నాయకత్వం భగత్‌సింగ్‌ను ఒక ఉగ్రవాదిగా పేర్కొంటూ, ఈ విప్లవకారుల ప్రాణాలను రక్షించేందుకు జోక్యం చేసుకోవలసిందిగా ప్రజలు చేసిన విజ్ఞప్తికి స్పందించకుండా నిరాకరించి, భగత్‌సింగ్‌ను అతని సహచరులను క్రూరంగా, కుట్రపూరితంగా ఉరి తీయటంలో వలసపాలకులకు తమ సహకారాన్ని అందించారు. 1947 అధికారమార్పిడి తదనంతర కాలంలో నూతన భారత పాలకులు ప్రజలలో భగత్‌సింగ్‌పట్ల, అతని సహచరులపట్లనున్న అసమాన ప్రాచుర్యాన్ని, ప్రేమాభిమానాలను సాధ్యమైనంత వరకూ తమ కనుకూలంగా మలచుకుంటూ, అదే సమయంలో తమ సామ్రాజ్యవాద లొంగుబాటు విధానాలను కొనసాగిస్తూవచ్చారు. కానీ, భారతదేశ విశాల ప్రజానీకం ముఖ్యంగా కమ్యూనిస్టు, దేశభక్తియుత, ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు భగత్‌సింగ్‌ను, అతని సహచరులను విప్లవకారులుగా సగర్వంగా స్వంతం చేసుకున్నారు. ఈ విప్లవకారులు ప్రదర్శించిన అత్యంత విశిష్ట సుగుణాలను ఎత్తిపట్టడంతోపాటు, వాటిని అనుసరించే ప్రయత్నం చేశారు. ఈ విప్లవకారులు ప్రాతినిధ్యం వహించిన శాస్త్రీయ భావజాలాన్నుండి నేర్చుకోవటానికి, వాటిని ముందుకు గొనిపోవటానికి ప్రయత్నించారు.

బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారత ఉపఖండ ప్రజానీకం ఐక్యపోరాటాలు సాగించే కాలంలో భగత్‌సింగ్ జీవించాడు; తన కృషి సాగించాడు, అమరుడయ్యాడు. విభజించి పాలించే వలస పాలకుల విధానానికనుగుణంగా తదనంతర కాలంలో ఉపఖండం రెండు దేశాలుగా(భారతదేశం, పాకిస్థానులుగా) విడిపోయినప్పటికీ, ఈ రెండు దేశాలలోని నూతన పాలకవర్గాల నాయకత్వాలు ద్రోహపూరితమైన పాత్ర పోషించినప్పటికీ, ఉపఖండపు ప్రజానీకం తమ సొంతమైన ఘనమైన ఉమ్మడి చరిత్రను, ఉమ్మడి పోరాట వారసత్వాన్ని కలిగివున్నారు. ఉమ్మడి లక్ష్యసాధనకోసం సాగే పోరాటంలో వారు ఒక్కటిగా నిలిచారు. కావున, వలసవాద పాలనను అంతంచేసేందుకు, ఫ్యూడలిజం సంకెళ్ళను బద్దలుచేసేందుకు సాగించిన పోరాటాల క్రమంలో ఉపఖండ ప్రజానీకం ప్రదర్శించిన వీరోచితమైన త్యాగాలన్నీ, ఈ ప్రజానీకమందరి ఉమ్మడిసొత్తు. అదేవిధంగా, ఈ చారిత్రక కాలంలో ఉపఖండంలోని వివిధ ప్రాంతాలలో విప్లవకారులు, కమ్యూనిస్టులు, శాస్త్రీయ ప్రగతిశీలుర ఆధ్వర్యంలో మొలకెత్తిన, వికసించిన భావజాలం మరియు ఉద్యమాలు కూడా! రెండు దేశాలుగా ప్రజలు విభజనకు గురికావటమనేది, ఈ వాస్తవాలనన్నింటినీ తుడిపివేయలేదు.

లాహోర్‌లోని భగత్‌సింగ్‌చౌక్‌ను నిర్మూలించటం–పాకిస్థాను పాలకులు చేపట్టిన అత్యంత సిగ్గుమాలిన, గర్హనీయమైన చర్య. ఈ చర్య ద్వారా, ప్రజానీకపు భావనల్ని చాలా మొరటుగా వారు గాయపరిచారు. స్వాంతత్ర్యోద్యమ అమరులపట్ల వారు తీవ్రమైన అగౌరవాన్ని ప్రదర్శించారు. పాకిస్థానులోని కొందరు–కొంతకాలం క్రితం దాకా భగత్‌సింగ్‌ను 'భారతదేశ నాయకుడు'గా పరిగణించటమేగాకుండా, పాకిస్థానులో భగత్‌సింగ్‌ను సంస్మరించే వారిని, ఆయనకు నివాళు లర్పించే వారిని సైతం 'ద్రోహులు'గా ముద్రవేయటమనేది నిజంగా విస్మయానికి గురిచేస్తుంది. ఉమ్మడి లక్ష్యంకోసం సాగిన పోరాటంపట్ల విషాన్ని ఎక్కించి, పరస్పర ఏహ్యభావాన్ని కలిగించటమే ఇక్కడ పాకిస్థాను పాలకుల ఉద్దేశ్యం. వీరి చర్య సామ్రాజ్యవాదులను మాత్రమే సంతృప్తిపరుస్తుంది. భగత్‌సింగ్ సామ్రాజ్యవాద వ్యతిరేకతకు, దేశభక్తికి మాత్రమే చిహ్నం కాదు, భారత ఉపఖండం మేరకేగాక ప్రపంచ వ్యాపితంగా శాస్త్రీయ భావజాలం, మార్క్సిజం, లెనినిజం; కార్మిక–కర్షక రాజ్యస్థాపన ధ్యేయం, దోపిడీ, అణచివేతల్లేని, యుద్ధాల్లేని ఓ సుందర సమాజ స్థాపన జరగాలని ఆయన వాంఛించాడు. ఏమైనా, పాకిస్థాను పాలకులు తమ చర్యలద్వారా భగత్‌సింగ్ భావాలు, లక్ష్యాలు వ్యాప్తిచెందకుండా నిరోధించాలని కోరుకున్నారు, ప్రయత్నించారు.

పాకిస్థాన్‌లోని దేశభక్తియుత, ప్రగతిశీల శక్తులు భగత్‌సింగ్‌కు సముచిత గౌరవాన్ని పునరుద్ధరించేందుకు నిలకడగా సంఘర్షిస్తూరావటం–ప్రజలలో భగత్‌సింగ్‌కు వున్న గౌరవం, ప్రేమాభిమానాలను తేటతెల్లంచేస్తున్నది. పాకిస్థాన్‌లోని 'అజోకా' అనే ఓ నాటక సమాజం భగత్‌సింగ్‌పై 'మేరే రంగ్‌దే బసంతీ చోలా' అనే నాటకాన్ని ప్రదర్శిస్తూ భారత ఉపఖండ ప్రజానీకం సాగించిన చారిత్రాత్మక పోరాటం ఒక ఉమ్మడి పోరాటమనీ, కుల,మతాల కతీతంగా పాకిస్థాను, భారతదేశాల్లోని ప్రజానీకమందరూ తప్పనిసరిగా తమ సొంతం చేసుకోవాలనే భావాన్ని వ్యాప్తిచేయడం స్వాగతించదగింది, హర్షించదగిందీకూడా. పాకిస్థానులోని దయాల్ సింగ్ కళాశాలలో 24 సంస్థల ఆధ్వర్యంలో 2012 సెప్టెంబరు 28న భగత్‌సింగ్ జయంతి సభను నిర్వహించటం, అందులో మాట్లాడిన వక్తలందరూ ఆసియాలోని పోరాడుతున్న ప్రజానీకమంతటి ప్రతినిధిగా భగత్‌సింగ్‌ను పేర్కొనటం చాలా మంచి విషయం. భగత్‌సింగ్ జన్మస్థలమైన ఫైసలాబాద్–లైలపూర్‌బాంగేలోని ఛాక్ నెం.105లో ఒక మ్యూజియం స్థాపనకు ప్రయత్నాలు సాగుతున్నట్లుగా తెలుస్తోంది–ఇది స్వాగతించాల్సిన విషయం.

ఈనాడు, పాకిస్థాను ప్రజానీకం, మొత్తంగా ఆసియా దేశాల ప్రజానీకం–సామ్రాజ్యవాదులు–ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు తమ ఆధిపత్యాన్ని చెలాయించటంలో భాగంగా సాగించే దోపిడీ, జోక్యం, వేధింపు, దురాక్రమణలకు గురౌతూ, వీటికి వ్యతిరేకంగా అత్యంత కఠినమైన, సంక్లిష్టమైన మరియు అత్యవసరమైన పోరాటాల నడుమవున్నారు. భగత్‌సింగ్ జీవితం, పోరాటం, భావజాలం–సామ్రాజ్యవాదానికి వ్యతిరేకం గానూ, సామ్రాజ్యవాద లొంగుబాటు పాలకులకు వ్యతిరేకంగానూ సాగించే పోరాటాన్ని మరింత ముందుకు కొనసాగించటంలో ప్రజానీకానికి మరింత శక్తిని, స్ఫూర్తిని అందజేస్తుంది. భగత్‌సింగ్ స్మారక చౌక్ పునరుద్ధరణకోసం దీర్ఘకాలంగా పాకిస్థాను ప్రజలు చేసిన పోరాటం చాలా చిన్నదైనప్పటికీ, చాలా అత్యవసరమైనది. పాకిస్థాను సోదరీ సోదరులకు మన మద్దతు, సంఘీభావం కొనసాగిద్దాం.

# పాలకుల 'విడతల వారీ భూపంపిణీ' ఓ మాటల గారడి

**రాజకీయ** సంక్షోభం ప్రారంభమైనప్పుడు, అవినీతి కుంభకోణాలు బట్టబయలౌతున్నప్పుడు, ప్రజావ్యతిరేకత పెరుగుతున్నప్పుడు వాటినుండి బయటపడేందుకు పాలకులు ప్రజాకర్షక పథకాలు, భూసంస్కరణలు, భూపంపిణీ గురించి మాట్లాడుతూ, ప్రజలను తమవైపు ఆకర్షించేందుకు వంచనా పూరితంగా వాగ్దానాలు చేస్తుంటారు. అందులో భాగమే రాష్ట్రప్రభుత్వం అమలు జరుపుతానంటున్న ఆరవ విడత భూపంపిణీ కార్యక్రమం.

రాష్ట్రంలో ప్రధాన పాలకవర్గ రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశం, వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రజల సమస్యలను గాలికి వదలి, అవినీతి కుంభకోణాల్లో మునిగితేలుతూ, వారి కుమ్ములాటల్లో అవి బహిర్గతమై, వాటినుండి బయటపడేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. అధికారంలోనున్న పాలకులు సెజ్‌ల పేరుతో పేదల, చిన్న, సన్నకారు రైతుల భూములను వివిధ రకాలుగా గుంజుకొని బడా పరిశ్రమాధిపతులకు, బహుళజాతి సంస్థలకు కట్టబెడుతున్నారు. పేదలను భూములకు దూరంచేస్తున్నారు. సాగునీరు, త్రాగునీరు, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతులను సంక్షోభంలోకి నెట్టటం మూలంగా వారు ఆత్మహత్యలకు పాల్పడాల్సివస్తున్నది. ఉపాధి అవకాశాలు తగ్గిపోవటం వలన గ్రామీణ పేదలు అనివార్యంగా వలసబాట పడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలకు అందుబాటులో లేకుండా పైపైకి పోతున్నాయి. పేదల జీవితాలు దుర్భరంగా మారాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఎడల పేద, మధ్యతరగతి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది.

పాలక, ప్రతిపక్షపార్టీలు ప్రజల అసంతృప్తిని చల్లార్చి తమ వైపుత్రిప్పుకొనేందుకు అనేక ఆకర్షణీయమైన వాగ్దానాలు ప్రకటిస్తున్నాయి. తమ భూములను బలవంతంగా గుంజుకోవటం, భూములకు తమను దూరంచేయటం ఎడల పేదలు, చిన్న, సన్నకారు రైతులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమౌతున్నది. ఇలాంటి నేపథ్యంలో జిత్తులమారి ప్రభుత్వం ముందుకు తెస్తున్నదే, ఈ ఆరవ విడత భూపంపిణీ!

ప్రజల భూ ఆకాంక్షను, భూపోరాటాలను చల్లార్చటానికి, వారి పోరాటాలను ప్రక్కదారి పట్టించడానికి తావే భూములు పంచుతామంటూ, అందుకు భూసంస్కరణ చట్టాలు చేస్తున్నామంటూ ఎంతో గొప్పగా ప్రకటించారు. అందులో భాగమే 1973 భూసంస్కరణల చట్టం. ఇంతకుముందు చేసిన చట్టాలను నీరుగార్చిన విధంగానే ఈ చట్టాన్నీ నీరు గార్చారు. ఈ చట్టంద్వారా రాష్ట్రంలో 18 లక్షలదాకా మిగులు భూములున్నాయని మొదట ప్రభుత్వం ప్రకటించింది. భూస్వాముల ప్రయోజనం కోరే పాలకులు మిగులు భూమిని అనేకసార్లు తగ్గించి చివరికి 7,99,663 ఎకరాలుగా నిర్ధారించి, 6,41,635 ఎకరాలను స్వాధీనపరుచు కొన్నామని, అందులో 5,82,319 ఎకరాలను పేదలకు పంపిణీ చేసినట్లుగా ప్రకటించారు. ఇంకా రెండు లక్షల ఎకరాలదాకా మిగులు భూములు స్వాధీనం చేసుకోవాల్సి వుందని తేల్చారు. సుప్రీంకోర్టు కూడా అందుకు గ్రీన్ సిగ్నల్ యిచ్చింది.

1973 భూ సంస్కరణల చట్టంవలన భూస్వామ్య వర్గానికి వాటిల్లిన నష్టం ఏమీలేదు. వారి భూములు పోయిందీలేదు. వారి ప్రయోజనంకోసం ప్రభుత్వం చట్టంలో అనేక లొసుగులు కల్పించటంవలన వాటిని ఉపయోగించుకొని భూస్వాములు, తమ భూములు చట్టపరిధిలోకి రాకుండా చేసుకోగలిగారు. రాజకీయ పలుకుబడిలేని అతికొద్ది మంది భూస్వాములయొక్క కొద్ది భూములు మాత్రమే మిగులు భూములుగా తేలాయి. ప్రభుత్వం పంచానని చెప్పుకొంటున్న భూముల్లో అత్యధిక భాగం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పేదలు ఆక్రమించుకొని సాగుచేసుకొంటున్న భూములే వున్నాయి.

1980 తర్వాత పాలకవర్గాలు భూసంస్కరణల ఊసే ఎత్తటం మానివేశాయి. పేదలకు భూములు పంచాల్సిన అవసరం లేనట్లుగా వ్యవహరించాయి. పేదల్లో మాత్రం భూదాహం పెరుగుతూవచ్చింది. తమ సమస్యలకు, భూమికి ఉన్న సంబంధాన్ని అర్థంచేసుకొని వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తూనే వున్నారు. అవి కొన్ని సందర్భాల్లో మిలిటెంట్ రూపం తీసుకొంటున్నాయి.

2004లో జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, పేదలకు భూములు పంచుతానని వాగ్దానం చేసింది. భూసంస్కరణల చట్టాన్ని అమలు జరుపుతానని ప్రకటించింది. భూపంపిణీతో పాటు, ఇంకా ఇతర వాగ్దానాల ద్వారా తిరిగి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రజలను వంచించటంలో ఎంతో నైపుణ్యం సంపాయించిన కాంగ్రెస్‌పార్టీ, భూముల సీలింగ్‌ని తగ్గించి భూస్వాముల నుండి మిగులు భూములు స్వాధీనం చేసుకొని పేదలకు పంచే విధానాలు చేపట్టకుండా, విడతలవారీరి భూపంపిణీ పేరుతో వింతనాటకం ప్రారంభించింది. దీనివలన భూస్వామ్య వర్గానికి ఎటువంటి నష్టం కలుగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జాగ్రత్త వహించింది.

గత 8 సంవత్సరాలకాలంలో ఇప్పటివరకూ ఐదు విడతల భూపంపిణీ కార్యక్రమం అమలుజరిపి 7.17 లక్షల ఎకరాలను 10 లక్షల నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేశామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించుకొంది. ఇలా పంచానని చెప్పుకొంటున్న భూముల్లో ఒక్క ఒకరం కూడా భూస్వాముల సొంత భూమిగాని, వారి ఆధీనంలో వున్న అన్యాక్రాంత భూమిగానిలేదు. నూటికి 80శాతం భూమి, ఇంతకు ముందే పేదలు వివిధ రూపాల్లో సాగు చేసుకొంటున్న భూములేనన్న యదార్థం బహిర్గతమైంది. వాటికి పట్టాలు యిచ్చి భూపంపిణీగా ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్నది. ఇవిగాక పేదలకు యిచ్చిన కొద్దిపాటి భూములు కూడా సేద్యానికి ఉపయోగపడని రాళ్ళభూములే. ఈ విషయాన్ని ఆధారాలతోసహా పత్రికలు ప్రకటించాయి. దీన్ని గమనిస్తే విడతలవారీ భూపంపిణీ ఎంత బూటకమో అర్థమౌతుంది.

రెండు సంవత్సరాల తర్వాత, గత జూలైలోనే 6వ విడత భూపంపిణీ చేపట్టి లక్ష ఎకరాలు పేదలకు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, అది వాయిదాలు పడుతూ వచ్చింది. నవంబరు 1వ తేదీన 6వ విడత భూపంపిణీ అమలుజరుపుతామని రెవిన్యూమంత్రి రఘువీరారెడ్డి కొద్దిరోజుల క్రితం ప్రకటించాడు. ఆరో విడత భూపంపిణీకి భూములు దొరకటం లేదని రెవిన్యూ అధికారులు చెబుతున్నారు. అందుకే భూపంపిణీ వాయిదా పడుతూవచ్చిందన్నట్లు మాట్లాడుతున్నారు. గత ఏడాది చివరిలో సమాచార హక్కు చట్టంక్రింద సేకరించిన వివరాల ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లో పంపిణీకి భూములే లేవని, తూర్పుగోదావరి జిల్లాలో 38, కృష్ణాజిల్లాలో 52, అనంతపురం జిల్లాలో 37, చిత్తూరుజిల్లాలో 73 ఎకరాలు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉన్నట్లు సమాచారం వచ్చింది. ఇతర జిల్లాల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉన్నట్లు వెల్లడైంది. సమాచార హక్కుచట్టం వివరాలు ఈ విధంగా ఉంటే, తాజాగా కలెక్టర్లు పంపించిన సమాచారం మేరకు హైద్రాబాద్ మినహా 22 జిల్లాల్లో 75వేల ఎకరాలు అందుబాటులో వున్నట్లు చెబుతున్నారు. దీన్ని గమనించినప్పుడు సమాచార చట్టప్రకారం అందిస్తున్న గణాంకాలు ఎంతబూటకమో తేటతెల్లమౌతున్నది వాస్తవ పరిశీలనలోకి వెళ్తే కలెక్టర్లు పేర్కొన్న భూములన్నీ ఇప్పటికే పేదలు సాగుచేసు కొంటున్న భూములేనని స్పష్టమైంది. ఆ భూములను, పంపిణీకి అందుబాటులో ఉన్న భూములుగా ప్రకటించారన్నది స్పష్టమౌతున్నది. 6వ విడత భూపంపిణీలో మొదట లక్షాయాభైవేల ఎకరాలు పంపిణీ చేస్తామని ప్రకటించి, భూముల కొరతపేరుతో 90వేల ఎకరాలకు కుదించారు. ఈ మేరకు కూడా భూములు అందుబాటులో లేవని చెప్పటం ఆశ్చర్యం గొలుపుతున్నది. దీన్ని గమనిస్తే భూసేకరణలో ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమౌతోంది.

పేదలకు భూములు పంచాలనే చిత్తశుద్ధివున్న పాలకులైతే పంపిణీకి యోగ్యమైన భూములకు కొరతలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమే నియమించిన కోనేరు రంగారావు భూకమీషన్ నివేదిక ప్రకారం వివిధ రకాల పంపిణీకి యోగ్యమైన భూములు రాష్ట్రంలో 60 లక్షల ఎకరాలదాకా ఉన్నాయని పేర్కొంది. అంతేగాకుండా భూపరిమితి తగ్గించవచ్చని, తద్వారా లక్షలాది ఎకరాల భూములు పేదలకు పంచవచ్చని పేర్కొంది. ప్రభుత్వం ఆ విధమైన భూపంపిణీకి ఎందుకు పూనుకోవటంలేదు. ఆ భూములను పేదలకు ఎందుకు పంచటం లేదు అన్న ప్రశ్న వెంటనే తలెత్తుతుంది. **(తరువాయి 6వ పేజీలో)**

ప్రవాహంలా తరలింపజేసే ఈ విధానం... సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మినహా మరోటి కాదు. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి దీనినే నయావలసవాదం అన్నారు. ఆయన ఇలా పేర్కొన్నారు: **'ఈ నయావలసవాదం ప్రత్యక్ష వలసవాదంకంటే మరింత ప్రమాదకరం, ఘోరమైనది. సామ్రాజ్యవాదులు నూతన రూపాలలో, నూతన పద్ధతుల్లో తమ గత వలసదేశాల ప్రజలను పెద్దఎత్తున దోపిడీ సాగించేందుకు తమకు అందుబాటులోని ప్రతివిధానాన్నీ ఉపయోగించుకుంటారు. వివిధ దొంతర్ల ఆర్థిక మీటల ద్వారా వారు తమ పట్టును తిరిగి పొందేందుకు, విస్తృత పరుచుకునేందుకు బలీయం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు'** (ఇండియా మార్ట్‌గేజ్డ్/ పే-111).

నూతన ఉదారవాద ఆర్థిక విధానాలు వ్యవసాయ రంగానికి కూడా వ్యాపించాయి : 1. వ్యవసాయరంగ సబ్సిడీలను తగ్గించటం 2. ధాన్యపు మార్కెట్‌పై నియంత్రణను తొలగించటం 3. వ్యవసాయ సరుకుల అంతర్జాతీయ వాణిజ్యంలో సరళీకృత విధానాలను అనుసరించటం4. ప్రభుత్వ సేకరణ ప్రక్రియను కుదించివేయటం 5. భారత ఆహారసంస్థ పాత్రను తగ్గించివేయటం 6. ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయటం 7. ప్రపంచమార్కెట్‌తో భారత వ్యవసాయాన్ని సమ్మిళితంచేయటం 8. తూర్పు భారతానికి రెండో పైరుపచ్చ విప్లవాన్ని అమలుచేయటం 9. లీజు మార్కెట్టును సులభతరం చేయటం 10.భూపరిమితి చట్టాలను రద్దుచేయటం 11. కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహించటం వంటి భారత ప్రభుత్వ చర్యలు ఇందులో భాగమే. 1960లలో ప్రారంభించబడిన మొదటి పైరుపచ్చ విప్లవం బహుళ జాతి పరిశ్రమలను-ముఖ్యంగా అమెరికా వ్యవసాయ వాణిజ్య పరిశ్రమలకు భారత వ్యవసాయ రంగాన్ని లోబడే విధంగా చేసి, సామ్రాజ్యవాద దోపిడీని తీవ్రంచేయటాన్ని మనం చూశాం. తూర్పుభారతదేశానికి ప్రతిపాదిస్తున్న రెండో పైరుపచ్చవిప్లవం దేశవాళీ వ్యవసాయ ఆచరణలను ధ్వంసం చేయటంతోపాటు, గ్లోబల్ గ్రీన్, మాన్‌శాంటో, కోకోకోలా, కార్గిల్ మరియు భారత కార్పొరేటు సంస్థలైన రిలయన్స్, భారతి, పెప్సికో, ఐటిసి, టాటా, మహీంద్రా, డిసిఎం, మహికోమొదలైన కంపెనీలకు మనదేశ రైతును పూర్తిస్థాయిలో బంధితుడిగా మార్చనుంది. ఈ విధంగా భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరనంతరం, భారత వ్యవసాయానికి దాని విస్తరణలతో సామ్రాజ్యవాద దోపిడీ అనేకరెట్లు పెరిగింది. మనదేశం అర్థవలస దేశంగా వుంది. రైతాంగపు అదనపు ఆదాయాన్ని బహుళజాతి కంపెనీలు దేశంనుండి తరలించుకుపోయాయి. బహుళజాతి పరిశ్రమలద్వారా ఉపాధి కోల్పోయిన మిగులు రైతులంతా భూములనుండి దూరం చేయబడు తున్నారు. ఈ కారణంగానే, పైరుపచ్చ విప్లవానికి గుండెకాయవంటి ప్రాంతాలైన పంజాబ్, హర్యానా, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుండి రైతుల ఆత్మహత్యల వార్తలు అధికంగా నమోదవుతన్నాయి. ఆయా రాష్ట్రాలలో పైరుపచ్చవిప్లవంగా చెప్పబడుతున్నదాని దుష్ఫలితాలను విశ్లేషించకుండా, భారత ప్రభుత్వం తూర్పుభారతానికి దానిని విస్తరిస్తున్నది. రైతుల ఆత్మహత్యల పరిస్థితులను అక్కడికి ఎగుమతి చేయటం మినహా ఇది వేరుకాదు.

## భూ పరాయీకరణ - భూమిహీన వ్యవసాయ కూలీల పెరుగుదల

భారతదేశానికి కొక చరిత్రవున్నదనుకుంటే, ఆ చరిత్ర ఏమంటే దళితుల నుండి, ఆదివాసులనుండి ఆదివాసీయేతరులు భూములను కబళించటమే. భారత దేశంలో గత ఆరు దశాబ్దాలపైగా కాలంలో అనుసరించిన వ్యవసాయ విధానాలు, చేపట్టిన కార్యక్రమాలన్నీ, గ్రామీణ ప్రాంతంలో అత్యధిక సంఖ్యలో భూమిహీన వ్యవసాయ కూలీల సంఖ్యను పెంచివేశాయి. 1901 జనాభా లెక్కల ప్రకారం మొత్తంగా వ్యవసాయ కూలీలు 15.3 శాతం మాత్రమే. 1931 జనాభాలెక్కల నాటికి ఈ సంఖ్య 18.3 శాతానికి పెరిగింది. ఈ సంఖ్య 1971 జనాభా లెక్కల నాటికి 26.3 శాతానికి చేరుకుంది. 2001లోని జనాభా లెక్కల ప్రకారం వ్యవసాయ కూలీల సంఖ్య 35 శాతంగా వుంది. ఈ విధంగా వ్యవసాయ కూలీల సంఖ్య పెరుగుదల సాధారణ విధానంగా కొనసాగుతూంది. వీరిలో అత్యధిక వ్యవసాయకూలీలు భూమి హీనులైన లేదా చిన్న, సన్నకారు రైతులుగా వున్న యస్‌సి, యస్‌టిలకు చెందినవారే. భూమిని కలిగివున్న వారికి సంబంధించి ప్రణాళిక సంఘం అందించిన సమాచారం ప్రకారం 2000-01 నాటికి సన్న, చిన్నకారు రైతులు మొత్తంగా భూమికలిగివున్న వారిలో 82 శాతం వుండగా, వీరు కలిగివున్న మొత్తం భూమి విస్తీర్ణం 40 శాతంగా వుంది. కాగా భూమి కలిగివున్న మిగిలిన 12 శాతం చేతుల్లో 60 శాతం భూమి వుంది. 37 శాతం భూమి పైస్థాయిలోనున్న కేవలం 6.5 శాతం వారి చేతుల్లో వుంది. 1971 నుండి 1991 వరకు భూమిహీన గ్రామీణ కుటుంబాల సంఖ్య 9.6 శాతం నుండి 11.3 శాతానికి పెరిగింది. దాదాపు భూమి హీనులుగావున్న (ఒక హెక్టారుకులోబడిన భూమి కలిగిన) వారి సంఖ్య 45.8 శాతం నుండి 62.8 శాతానికి పెరిగింది. ఆ విధంగా, ఒకవైపున ఆదివాసుల, దళితుల భూపరాయీకరణ కారణంగా భూమి హీనుల సంఖ్య పెరుగుతుండగా, మరోవైపున కొద్దిమంది చేతుల్లో భూ కేంద్రీకరణ పెరుగుతున్నది. వలసవాదానంతరకాలంలో భూపరాయీకరణను నిరోధించటానికి, భూములనుండి చట్టవిరుద్ధ తొలగింపుల బారినుండి రక్షించటానికి ఎన్నో చట్టాలు చేయబడ్డాయి. వివిధరకాల ఈ చట్టాలలో భూహక్కును కాపాడటం, భూ పరాయీకరణ నుండి రక్షించటం, సాంప్రదాయక హక్కులను గ్యారంటీ చేయటం, చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భూములను ప్రభుత్వం స్వాధీనపరుచుకుని తిరిగి హక్కుదారులకు హక్కు కల్పించటం వంటి వెన్నోవున్నాయి. ఆదివాసీయేతరులు ఆదివాసుల నుండి భూములను ఆక్రమించుకోకుండా నిరోధించేందుకు వివిధ ప్రభుత్వాలు కౌలుదారుల రక్షణ చట్టం, భూ సంస్కరణల చట్టం వంటి వాటి ద్వారా చట్టబద్ధ అవకాశాలు కల్పించాయి.

1950లో అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం ప్రకారం, యన్‌సి,యన్‌టిలు అధికంగా వుండే ప్రాంతాలను రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు క్రిందకు, మరికొన్ని ప్రాంతాలకు ఆరవ షెడ్యూలు క్రిందకు చేర్చారు. దీని ప్రకారం ఈ ప్రాంతాలలో వడ్డీవ్యాపారుల కార్యకలాపాలను స్పష్టంగా నిషేధించింది.

అదేవిధంగా 1996లో రూపొందించిన 'పీసా' చట్టం మరో మాటల్లో భూరియా కమిటీ సిఫార్సు మొదటిసారిగా గ్రామసభను మాత్రమే సమర్థమైన అధికారయుతమైనదిగా గుర్తించి, ఆదివాసుల ఆచార సాంప్రదాయాలను పరిరక్షించింది. భూ వివాదాలను పరిష్కరించే అధికారాలనుకూడా ఈ చట్టం గ్రామ సభకు ఇచ్చింది. షెడ్యూల్డు ప్రాంతాలలో, ఆదివాసీ ప్రాంతాలలో భూమితోసహా వనరులన్నింటిపై అధికారాలన్నీ ఆదివాసీ సమూహాలకే చెందాలని, కనుక ఈ ప్రాంతంలో వనరులనుండి, భూములనుండి వారిని ఎవరూ పరాయీకరించరాదని ఈ చట్టం చెబుతోంది.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సమతా కేసులోనూ, తరాలుగా వారి సాగులో వుంటున్న భూమిపై ఆదివాసుల హక్కులను సుప్రీం కోర్టు గుర్తించింది. కనుక, వారి సాంప్రదాయహక్కును ఏ విధంగానూ కాలరాయటం జరుగరాదు. వీరి ప్రాంతంలోని ఏ భూమి లేదా ఏ వనరులను ఏ పరిశ్రమకూ యధేచ్ఛగా కట్టబెట్టరాదు. సుప్రీంకోర్టు పరిశ్రమను కూడా ఆదివాసీయేతరమైనదిగా పేర్కొంది.

న్యాయపరమైన పరిహారాలు, రాజ్యాంగ నిబంధనలు, అధికారిక ఆదేశాలు ఎన్నివున్నప్పటికీ భూ పరాయీకరణ నిరాటంకంగా సాగుతూనేవుంది. భూస్వాముల, వ్యాపారుల, వడ్డీవ్యాపారుల, పారిశ్రామికవేత్తల, ప్రభుత్వ ఉన్నతాధికారుల, బిల్డర్ల చేతుల్లో ఈ భూములన్నీ కేంద్రీకృతమౌతున్నాయి.

## అభివృద్ధి పథకాల పేరిట భూమి పరాయీకరణ

ఆధునిక అభివృద్ధి క్రమానికి విస్థాపనకు గురిచేయటమనేది ఒక చిహ్నంగా మారింది. మౌలిక వసతులకల్పన, ప్రజల అవసరాలు, జలవిద్యుత్తు ప్రాజెక్టులు, పంటకాల్వల తవ్వకం, గనులను తవ్వి ఖనిజాలను వెలికితీయడం మొదలైన చర్యల పేరుతో ప్రజలను తమ నివాస ప్రాంతాల నుండి విస్థాపనకు గురిచేయటం జరుగుతున్నది. ఏమైనా, వారికి తిరిగి మరొక ఆవాసం కల్పించటమనేది తీవ్ర సమస్యగా వుంది. భూమి హీనత, ఉద్యోగ రాహిత్యం, నివాస సౌకర్యం లేకపోవటం, వ్యాధిగ్రస్తం కావటం, అభద్రత, ఉమ్మడి వనరులను కోల్పోవటం వంటి కారణాలతో నిర్వాసితులు దుర్భర పరిస్థితుల నెదుర్కొంటున్నారు.

1894 భూసేకరణచట్టం, భూమి బదలాయింపుకు నష్టపరిహారం చెల్లింపు గురించి పేర్కొంది. కానీ, ఒక అర్ధఫ్యూడల్, అర్ధభూస్వామ్య వ్యవస్థలో, భూమిపై అధికార నియంత్రణ, చెలామణీ, భూమిపై కౌలుదారుల హక్కువంటివన్నీ కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించబడిన వర్థమాన దేశంలో, తన చెమటోడ్చి భూమి దున్నేవాడు నష్టపరిహారాన్ని అందుకోవటంలో వాస్తవ బాధితునిగా వున్నాడు. ఈ భూసేకరణ చట్టంలో కౌలుదార్లకు లేదా వ్యవసాయ కూలీలకు ఏ విధమైన నష్టపరిహారం చెల్లింపుకూ చోటులేదు.

## ప్రభుత్వ అటవీ విధానము-భూ పరాయీకరణ

వలస పాలన కాలంలో రూపొందించబడి, వలస పాలనానంతర కాలంలోనూ కొనసాగుతున్న అటవీ చట్టాలు పెద్దఎత్తున భూ పరాయీకరణకు అవకాశం కల్పించాయి. భారతదేశం వలసగా నున్నకాలంలో 1865, 1878, 1927 సం॥లలోనూ; వలసపాలనానంతర కాలంలోనూ ప్రభుత్వ అటవీ విధానం ఈ ప్రధాన సూత్రాలపై ఆధారపడివుంది. అవి: 1. అడవి మొత్తంపై రాజ్యం సర్వాధికారాలను కలిగివుంది. 2. అడలోకి ప్రవేశహక్కును తప్పనిసరిగా నిషేధించాలి 3. ముడి వనరులకు, ప్రభుత్వ ఆదాయానికి అడవి ఒక వనరు. ఈ లక్ష్యాల సాధనకనుగుణంగానే వలస పాలనానంతర భారతదేశంలోనూ అటవీ చట్టాలు ఆదివాసులను మరింత నిరోధించేవిగా, దోపిడీకి గురిచేసేవిగా, ప్రజావ్యతిరేక మైనవిగా వ్యవహరిస్తూ వచ్చాయి. ఈ విధంగా 'రాజ్యమే సర్వాధికారి' అనే అవగాహన ఫలితంగా ఆదివాసుల, దళితుల సాంప్రదాయక హక్కులు, ఆచరణలతో వైరుధ్యం ముందుకొచ్చింది. చారిత్రకంగా ఆదివాసులకు, అడవుల్లో నివసించే వారికి-అటవీశాఖ వంటి ప్రభుత్వ విభాగాలతో సంబంధం శత్రుపూరితంగా వుంటూవచ్చింది. అడవుల్లో నివశించే వారందరినీ ప్రభుత్వం ఆక్రమణదారులుగా భావిస్తూ, వారందరినీ తరిమివేయాలని నిశ్చయించుకుంది.

## సామ్రాజ్యవాద ప్రపంచీకరణయుగంలో 'పెట్టుబడి' స్వభావం

భారత ఆర్థిక వ్యవస్థ-అర్థ ఫ్యూడల్, అర్థవలస అవునా కాదా అనే కొంత గందరగోళం నెలకొనివుంది. వలసానంతర భారతదేశంలో వ్యవసాయంతోపాటు పరిశ్రమలలోనూ పెద్దఎత్తున పెట్టుబడి చొరబాటును చూశాం. ప్రజాసౌకర్యాలు, రోడ్లు, రైల్వేలు, ఆనకట్టలు, పంటకాల్వలు మొదలైనవి కల్పించటం రూపంలో డీ కాలనైజేషన్ ప్రయత్నాలు జరిగాయి. ఈ నిర్మాణాలు విదేశీ ద్రవ్య పెట్టుబడి తోడ్పాటుతో జరుగుతున్నప్పటికీ, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఎడిబి, డిఎఫ్ఐడి మరియు ఇంకా అనేక సంస్థలు భారదేశంలో పెట్టుబడి పెడుతున్నప్పటికీ, ఈ ప్రాజెక్టులన్నీ వాటికవే స్వతంత్ర అభివృద్ధికి బాటలు వేసేవిగా ప్రకటించుకున్నాయి. ఈ విధంగా ప్రభుత్వం నుండీ అలాగే విడిగా, పెట్టుబడుదారులనుండీ పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ఈ పెరుగుతున్న మదుపు, భారత ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించింది. కానీ ఫ్యూడల్ సమాజాన్ని రద్దు చేయటమో లేదా దానిని బలహీనపరచటమో గాకుండా, ఈ పునర్నిర్మాణమనేది పెట్టుబడిదారీ శ్రమసంబంధాలను ప్రవేశపెడుతూనే ఫ్యూడల్ ఉత్పత్తి విధానాన్ని నిలబెట్టివుంచింది. కనుక, ధనికరైతులతో పాటుగా ఫ్యూడల్ భూస్వాములు కొనసాగుతున్నారు. పాశ్చాత్య దేశాల్లో, పెట్టుబడిదారీ విధానం ముందుకొచ్చినచోట్ల ఉనికిలోవున్న ఫ్యూడల్ ఆస్థి సంబంధాలను కూలద్రోసి పెట్టుబడిదారీ శ్రమ సంబంధాలను నెలకొల్పటం జరిగింది. ఆ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అన్ని వేళలా అభివృద్ధికరమైనది. అది తన స్వీయప్రతిబింబం వంటి సమాజాన్నే పునర్నిర్మాణం చేసుకుంటుంది. తన ఆర్థిక వ్యవస్థలో శ్రామికులకు పనికల్పించి అదనపు విలువను అది సృష్టించుకుంటుంది. దీనినే పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానమంటారు. వాణిజ్యకార్యకలాపాల ద్వారాకూడా అదనపు విలువను రాబట్టుకోవచ్చు, దీనిని వాణిజ్య పెట్టుబడి అంటాము.

సామ్రాజ్యవాద దశలోని ఆర్థిక వ్యవస్థలో, భారతదేశంవంటి ఫ్యూడల్ లేదా పెట్టుబడిదారీ పూర్వపు ఉత్పత్తి విధానాల్లోవున్న అభివృద్ధి చెందని, పరాధీన, వలస దేశాలకు పెట్టుబడిని ఎగుమతి చేయటం ద్వారా అదనపు విలువను సమకూర్చుకోవచ్చు. విస్తారమైన మార్కెట్టును, చౌక శ్రమను, సరిపడినంతముండి సరుకును, భూమిని ఇది హామీ ఇస్తుంది. లెనిన్ మాటల్లో 'సామ్రాజ్యవాదం -పెట్టుబడీదారీ విధానపు అత్యున్నత దశ' సామ్రాజ్యవాద దశలో, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి నిరోధకంగా, వ్యాధిగ్రస్తంగా వుంటుంది. అది ఇకనేమాత్రమూ ప్రగతిశీలంగా వుండజాలదు. ఆర్.ఎస్‌రావు ఈ విధంగా పేర్కొన్నారు: పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికరమైన దంటున్నామంటే గత కాలపు అన్ని ఉత్పత్తి విధానాలన్నింటిపై అధికంగా ఉత్పాదకతను బహిర్గతం చేసే సామర్థ్యం వుండటం కారణంగానే. ఫ్యూడల్ వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించటం నుండి వైదొలిగి, ఫ్యూడల్ ఉపరితల నిర్మాణంలో కాందిశీకునిలా అది తన రక్షణను కోరుకున్నది. సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ విధానం కోల్పోయిన ఒక ముఖ్యమైన లక్షణమిది. వలస దేశాలను పరిపాలన చేసేందుకు పాలక ఫ్యూడల్ వర్గాలతో సామ్రాజ్యవాదం షరీకవటమే, పెట్టుబడిదారీ విధానానికి ప్రతీఘాతుకసారాన్ని అరువు తెచ్చుకున్నట్లయింది. (ఆర్.ఎస్.రావు-క్యాపిటల్ వితవుట్ క్యాపిటలిజమ్. టువార్డ్స్ అండర్‌స్టాండింగ్ సెమిఫ్యూడల్ సెమీకలోనియల్ సొసైటీ, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాదు -పే.85-86)

## భారత బూర్జువా వర్గం దళారీ స్వభావం కలది

భారత బూర్జువా వర్గం సామ్రాజ్యవాదంపై నానాటికీ మరింతగా ఆధారపడుతోంది. ఉక్కు, అల్యూమినియం, మైనింగ్, రసాయనాలు, చమురు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్‌లతోపాటు చిల్లర వర్తకంలోకి సహా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దాదాపు అన్ని ముఖ్యమైన పరిశ్రమలలోకీ జొరబడుతున్నది. ఈ విధంగా కీలకమైన పరిశ్రమలన్నీ విదేశీ ద్రవ్యపెట్టుబడి గుప్పెటలోవున్నాయి. సామ్రాజ్యవాద ప్రభువులపై భారత బూర్దువా వర్గం ఆధారపడటం వారిని స్వభావరీత్యా దళారీలుగా మార్చింది. వివిధ రూపాలలోని మిలాఖత్తుల ద్వారా సంయుక్త నిర్మాణాలు, సబ్సిడరీలు, కమీషన్ ఏజెంట్లు తదితరమైన వాటి ద్వారా విదేశీ ప్రత్యక్షపెట్టుబడితో వారు ప్రత్యక్షంగా కలగలిసివున్నారు. కా॥ తరిమెల నాగిరెడ్డి తన 'తాకట్టులో భారతదేశం'లో చెప్పిన విధంగా 'టాటాలు, బిర్లాలు, మఫత్‌లాలు మరియు పదుల సంఖ్యలో నున్న ఇతరులంతా విదేశీ ద్రవ్య పెట్టుబడి రక్షిత గొడుగుకింద పెరిగారు, పెరుగుతున్నారు'.

## భూమిహక్కు రాజకీయ సమస్య- దీనిని రాజకీయంగానే పరిష్కరించాలి

ప్రస్తుత సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో భారతదేశంలోని ఏ పాలక రాజకీయ పార్టీ కూడా 'భూ సంస్కరణల'ను చేపట్టటం లేదు. కాంగ్రెస్, బిజెపి, డిఎంకె, ఎఐడిఎంకె, టిఎంసి, ఎస్‌పి, బిఎస్‌పి, జెడిఎస్, ఎల్‌జెఎస్, బిజెడి, అకాలీదళ్ మొదలైన పాలక రాజకీయ పార్టీలు, భారతవ్యవసాయ సంక్షోభానికి-నీటిపారుదల సౌకర్యాలు, అధికోత్పత్తి వంగడాలు, రసాయన ఎరువులు, పురుగు మందుల వంటి సాంకేతిక అంశాల కొరతలతో పాటు, ఇతర వ్యవసాయ విస్తరణ సేవలకు సిద్ధంగా వుండలేక పోవటం కారణమంటున్నాయి. కనుక, ఈ సాంకేతిక అంశాలను అందుకోవటం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోగలగటం, తద్వారా వ్యవసాయ సంక్షోభాన్ని నివారించుకోగలమని వారు పేర్కొంటారు.

ప్రభుత్వమనుసరిస్తున్న నయాఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా వ్యవసాయంలో సంక్షోభం నెలకొన్నదని సిపిఐ, సిపిఐ(ఎం), ఫార్వర్డ్‌బ్లాక్, ఆర్ఎస్‌పి వంటి పార్లమెంటరీ వామపక్ష పార్టీలు భావిస్తాయి. వ్యవసాయానికి మద్దతు, గ్రామీణ ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతుధర, వ్యవసాయ రుణాల ఏర్పాటు, వ్యవసాయ అవసరాలకు సబ్సిడీ, ప్రజాపంపిణీ వ్యవస్థను ధృఢపరచటం, ప్రజలందరికీ ప్రభుత్వమే పని కల్పించటం వంటి చర్యలు ఈ సంక్షోభాన్ని పరిష్కరించగలుగుతాయని వారు ఉద్భోదిస్తారు.

ఏమైనప్పటికీ, మార్క్సిజం - లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని విశ్వసించేవారు...వ్యవసాయ సంక్షోభ పరిష్కారానికి భూసంస్కరణలను ప్రధానంగా ముందుంచుతారు. వారిదృష్టిలో అర్థఫ్యూడల్, అర్థవలస సామాజిక వ్యవస్థలో ప్రగతిశీల వ్యవసాయ సంబంధాలను ఎవరూ ఊహించలేరు, భూసంస్కరణలను రాజకీయ సమస్యగానూ, అది రాజకీయంగానే పరిష్కరించబడాలనీ వారు భావిస్తారు. భూమి హీనులకు భూమిని పంపిణీ చేయటంలో ప్రభుత్వవైఫల్యాన్ని మనం చూశాం. కనుక, భూ సంస్కరణలకు ముందు, అనంతరమూ కూడా సామాజిక ఆర్థిక రాజకీయ పోరాటం తప్పనిసరి. సామ్రాజ్యవాదంతో జతకట్టిన ఫ్యూడలిజం, దళారీ పెట్టుబడిదారీ విధానాల పాలనలోని భారత ఆర్థిక వ్యవస్థను అర్థ-ఫ్యూడల్, అర్థ-వలస దేశంగా మనం నిర్వచించుకున్నాం. కనుక, భారత సమాజంలో ప్రధానవైరుధ్యం-సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం, దళారీ పెట్టుబడిదారుల కూటమికి-విశాల జనబాహుళ్యానికి నడుమవుంది. కనుక, మనం సామ్రాజ్యవాదానికీ వారి విశ్వాసపాత్రమైన మిత్రులు ఫ్యూడలిజం, దళారీ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా దీర్ఘకాల పోరాటాన్ని ప్రారంభించాలి. సామ్రాజ్యవాదానికి ఫ్యూడలిజం సామాజిక భూమికగా వుంది గనుక, ఫ్యూడల్ వ్యతిరేక పోరాటమే సారాంశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంగా వుంటుంది. కనుక, వ్యవసాయక పోరాటమే విప్లవానికి ప్రధాన యిరుగా వుంటుంది. ఈ లక్ష్యాన్ని సాధించే క్రమంలో మనం ఫ్యూడల్ భూస్వాముల చేతుల్లోనున్న భూములనన్నీ స్వాధీనపరుచుకోవాలి. ప్రజలను రాజకీయంగా చైతన్యవంతుల్నిజేసి, సాగించే ఈ విధమైన దీర్ఘకాల పోరాట క్రమంలో ప్రతిఒక్కరూ మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనావిధానంపై ఆధారపడిన కార్మికవర్గభావజాలంతో సాయుధమవ్వాలి.

***(తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 7-10-12న విశాఖపట్నంలో జరిగిన సదస్సులో ఆంగ్లంలో చేసిన ప్రసంగపాఠానికి తెలుగు అనువాదం -సంపాదకుడు.)*** ✡

# కులవ్యవస్థకు, దాని పీడనలకు; భూస్వామ్య సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా యువజన సదస్సు





రెంటచింతల గ్రామంలో యువజనులకవాతు; సమ్మేళనంలో ప్రసంగిస్తున్న డా॥ కొల్లారాజమోహన్; సమ్మేళనానికి హాజరైన యువజనులు

**రెంటచింతల, 28-10-12:**

నవయువనమాఖ్య గుంటూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో 28-10-2012న రెంటచింతలలో జిల్లా యువజన సమ్మేళనం జరిగింది. ఉదయం 11 గం॥లకు జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన యువజనులు, ఎన్‌వైఎస్ నాయకులు ఎర్రటోపీలు ధరించి, ఎన్‌వైఎస్ జెండాలు చేబూని కవాతుగా ప్రదర్శన చేశారు. 200మంది యువకులతో క్రమశిక్షణగా సాగిన ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. సాగుభూముల కొరకు, నివాసస్థలాల కొరకు పోరాటం సాగిస్తున్న దళిత, పీడిత-పేదల పోరాటాలకు మద్దతు తెలపాలనీ, భూస్వామ్య సామ్రాజ్యవాద భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలనీ గ్రామవీధులలో యువజనులు ఎలుగెత్తి నినదించారు.

ప్రదర్శన అనంతరం ప్రారంభమైన సమ్మేళనానికి ఎన్‌వైఎస్ జిల్లా నాయకులు కామ్రేడ్స్ రాజేశ్వరి, శ్రీను, లక్ష్మణ్, వెంకన్నలు అధ్యక్షవర్గంగా వహించారు. ముఖ్యవక్తగా వచ్చిన నల్లమడ రైతుసంఘం నాయకులు డా॥కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ నేటి యువత తమను, సమాజాన్ని పీడిస్తున్న ఏ సమస్యను గూర్చి కూడా ఆలోచించలేని గందరగోళ స్థితిలోకి నెట్టబడ్డారన్నారు. గుంటూరుజిల్లాలాంటి ఉద్యమ చరిత్రగల ప్రాంతంలోని యువత, గత పోరాటాల గురించి తెలుసుకోవాలని, సమాజ శ్రేయస్సు గూర్చి ఆలోచించాలని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కన్నెగంటి హనుమంతు నాయకత్వంలో పల్నాడు ప్రాంతంలో సాగిన పుల్లరి వ్యతిరేక ఉద్యమం; పెదనందిపాడు, చీరాల-పేరాలలలో సాగిన పన్నుల నిరాకరణోద్యమం; భూస్వామ్య విధానానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సాగిన మహత్తర తెలంగాణా సాయుధ పోరాటంలలో యువతరం ముందు పీఠిన నిలిచారన్నారు. సమాజంలోని వివిధ సమస్యల గూర్చి ఆలోచించి, వీటి పరిష్కారాల మూలాలను అన్వేషించి ప్రజల్ని చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత నేటి యువతరానిదేనంటూ దేశీయ అభివృద్ధికోసం, ఉత్పత్తివనరుల పరిరక్షణకోసం ఉద్యమించాలని డా॥ రాజమోహన్ పిలుపునిచ్చారు.

ఎన్‌వైఎస్ రాష్ట్ర కార్యదర్శి కా॥ ఎస్.కె. బాషా మాట్లాడుతూ 65 సం॥ల 'స్వతంత్ర' భారతదేశం నేడు అభివృద్ధి పథాన దూసుకుపోతోందని శ్రీహరికోటనుండి రాకెట్లను నింగికెగరేస్తున్నారని, కానీ ఇదే భారతదేశంలోని ప్రజలు నూటికి 80 మంది రోజుకి 20 రూ॥ల ఆదాయంలేని దుస్థితిలో ఉన్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయన్నారు. కనుక, ప్రస్తుత పరిస్థితి దోపిడీ శక్తుల అభివృద్ధికే తోడ్పడుతుందని స్పష్టమౌతోందన్నారు. మరోప్రక్క ఇప్పటికీ దళితులపై అగ్రకుల దురహంకార, పెత్తందారీశక్తుల దాడులు, హత్యాకాండలు సాగుతూనే వున్నాయనీ, లక్ష్మింపేటలో దళితులపై జరిగిన మారణకాండ; రెంటచింతలలోని పేదల, దళితుల ఇళ్ళస్థలాల పోరాటంపై సాగుతున్న పెత్తందారుల దాడులవంటి వాటివెనుక కులవ్యవస్థకు వెన్నుదన్నుగా భూస్వామ్య, పాలకవర్గాలు నిలబడి వున్నాయని ఇలాంటి పరిస్థితులలో యువతరం- కులవ్యవస్థకి, దానిని నిలబెడుతున్న భూస్వామ్య, సామ్రాజ్యవాదాలకి వ్యతిరేకంగా, సమాజంలో ప్రజలు జీవించలేని పరిస్థితులకు కారణమైన దోపిడీకి వ్యతిరేకంగా యువజనులను సంఘటితం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

న్యాయవాది శానంపూడి వెంకటేశ్వరరెడ్డిగారు మాట్లాడుతూ మన రాజ్యాంగం దళిత-పేద ప్రజలకు కొన్ని హక్కుల్ని కల్పించినప్పటికీ కనీసం వాటినైనా అమలుపర్చటంలో పాలకులు విఫలమయ్యారన్నారు.

పిడిఎస్ఓ మాజీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కా॥అజిత మాట్లాడుతూ నేడు సమాజంలో జరుగుతున్న దోపిడీని, అన్యాయాన్ని ప్రశ్నించి వాటికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. యువతను మద్యం, మత్తుపదార్థాల వంటి వ్యసనాలకు బానిసలుగా మార్చి వారి బలహీనతలతో, భావోద్రేకాలతో వ్యాపారం చేస్తున్న పెట్టుబడిదారి వర్గాలు కోట్లు గడిస్తున్నాయని, తమ అధికారంకోసం, ఈ ప్రభుత్వాలు యువతరాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. ఈ దళారీ పాలకుల విధానాలను యువతరం ఎదిరించాలని, ప్రజలందరి మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఈ సభలో ఇంకా కామ్రేడ్స్ దండా ప్రసాద్, బలరాం, శ్రీను తదితరులు మాట్లాడారు. లక్ష్మింపేట దళితుల పోరాటానికి మద్దతునిస్తూ, రెంటచింతల ఇళ్ళ స్థలాల ఆందోళనకు, పశ్చిమగోదావరి జిల్లా దొండపూడి దళిత నిరుపేదల నివాస స్థలాల ఆందోళనకు సంఘీభావం తెలుపుతూ, యువతరం ఎదుర్కొంటున్న ఉపాధి సమస్యపై విషసంస్కృతిని వ్యతిరేకిస్తూ, వివిధ సామాజిక సమస్యలపై సమ్మేళనం తీర్మానాలు చేసింది.

సమ్మేళనానికి ముందుగా ఎన్‌వైఎస్ కార్యకర్తలు రెంటచింతల, దుర్గి, వెల్దుర్తి, మాచర్ల మండలాలలోని 25 గ్రామాలలో విస్తృతంగా కరపత్రాల పంపిణీతో దళప్రచారం నిర్వహించారు. పిడుగురాళ్ళ, కారంపూడి, రాజుపాలెం మండలాలలోని గ్రామాలలో సమావేశాల ద్వారా, రేపల్లె, మంగళగిరి, గుంటూరు తదితర ప్రాంతాలలో అన్ని సెక్షన్ల ప్రజాశ్రేణులలోనూ, ప్రభుత్వ కార్యాలయాలలోనూ కరపత్ర పంపిణీ - ప్రచారం సాగించారు.

✸

## లక్ష్మింపేట... (చివరి పేజీ నుండి)

కో-కన్వీనర్స్ దుడ్డు ప్రభాకర్, గెద్దం ఝాన్సీ, ఎస్. ఝాన్సీ; సంఘీభావ కమిటీలో భాగస్వాములుగావున్న కుల నిర్మూలన పోరాట సమితి, రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్), దళిత స్త్రీ శక్తి, తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్, స్త్రీ విముక్తి సంఘటన, ప్రగతిశీల కార్మిక సంఘం, విరసం, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం, చైతన్య మహిళా సంఘం, దళిత ఐక్యవేదిక, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం, మానవ హక్కుల వేదిక, పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్, ప్రజాకళా మండలి, ప్రజాకళాకారుల సంస్థ మొదలైన సంస్థల ప్రతినిధులు పాదయాత్రలో పాల్గొన్నారు.

పాదయాత్రలో నీలిజెండా, ఎర్రజెండాలను కలిపిన 'నీలిలాల్' జెండాలను పట్టుకొని కార్యకర్తలు నడిచారు. పాదయాత్ర పొడవునా బాధితుల డిమాండ్లు మారుమ్రోగాయి. పాదయాత్ర ఆయా గ్రామాలకు చేరుకొనే లోగా, ఆ గ్రామ ప్రజలు పాదయాత్రకు స్వాగతం పలికారు. వారి గ్రామాలకు తీసుకువెళ్ళి గ్రామంలో పాదయాత్ర జరిపిన అనంతరం సమావేశం జరిగేది. ఈ సమావేశంలో కన్వీనర్, కో-కన్వీనర్లు, ఇతర భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు ప్రసంగం చేశారు. ఆయా పల్లెల్లో పాదయాత్రీకులకు రాత్రి భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. పాదయాత్ర జరుగుతున్న కొన్ని కూడళ్ళలో రాజాం, శ్రీకాకుళం, నవభారత్ జంక్షన్, అంబేడ్కర్ సర్కిల్, చిలకపాలెం జంక్షన్‌లో, హైవే రోడ్డుపై మానవహారంగా ఏర్పడి లక్ష్మింపేట బాధితుల డిమాండ్లను జన సమూహానికి కమిటీ నాయకులు వివరించారు. మొత్తం ప్రతి సమావేశానికి ముందు కళాకారుల వేసిన నృత్య ప్రదర్శనలు, పీడిత ప్రజల విముక్తితో ముడిపడి వుండే సందేశంతో పాడిన పాటలు దారిపొడవునా ప్రజలను ఎంతో ఆకర్షించాయి. ఈ నాలుగు రోజుల పాదయాత్రలో కళాకారులు ఎంతోక్రమశిక్షణతో ప్రజాకళాకారులుగా వ్యవహరించారు. ఇదిప్రత్యేకంగా పేర్కొనవలసిన అంశం.

పాదయాత్రలో నడిచిన గ్రామాలను అంటిపెట్టు కున్న పొలాలన్నీ కాపులవే, అగ్రకులాల వారివే లేక పట్టణ ప్రాంతాలలో ఉద్యోగులు చేసుకుంటున్న వారు కౌలుకిచ్చినవేనని దళితులుగా తమకే భూమి లేదని ఆయా గ్రామాల ప్రజలు పాదయాత్రలో పాల్గొన్న వారికి తమ బాధను వ్యక్తం చేసుకున్నారు. అయితే ఆ భూముల్లో ప్రధానంగా దళితులే వ్యవసాయ కూలీలు. శ్రీకాకుళం జిల్లాలోని వంగర, పాలకొండ మండలాల్లో ఈనాటికీ రెండు గ్లాసుల సిద్ధాంతం, అంటరానితనం అమలవుతూనే వుంది. వి.ఆర్. అగ్రహారంలో ఇప్పటికీ దళితుల్ని చెరువు దిగనీయరని ఇలాంటి అనేక అంశాలు పాదయాత్రలో వెలికి వచ్చాయి.

పాదయాత్ర వంగర, రేగిడి, ఆముదాలవలస, రాజాం, జి.సిగడం, పొందూరు, ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలాల్లో దాదాపు 125 కిలోమీటర్లు కొనసాగింది. 100పై చిలుకు గ్రామాల ప్రజలను చైతన్యపరిచారు.

ఈ నాలుగు రోజుల పాదయాత్రలో 'సరసనాపల్లి' 'పోర్లాం' 'పెద్ద సిర్లాం', 'బోరాడ' 'రాజాం', 'వి.ఆర్. అగ్రహారం', 'పొదిలి', 'పొందూరు', 'లోలుగు' 'చిలకపాలెం', శ్రీకాకుళంలో 'చౌదరి సత్యనారాయణ కాలనీ' ప్రజలు పాదయాత్రలో పాల్గొన్న వారికి భోజన సదుపాయాలు వగైరా ఏర్పాట్లు చేసి పాదయాత్రలో పాల్గొన్న వారిని ఎంతో ఆప్యాయంగా ఆదరించారు.

16వ తేదీన ఉదయం ఆరుగంటలకు పాదయాత్ర ప్రారంభమై చిలకపాలెం, ఎచ్చెర్ల మీదుగా, మధ్యాహ్నానికి శ్రీకాకుళం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజి చేరుకుంది. మధ్యాహ్న భోజనానంతరం అక్కడి నుంచి సెవెన్ రోడ్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్ నవభారత్ జంక్షన్‌ల మీదుగా సాయంత్రానికి పాదయాత్ర డా॥బి.ఆర్. అంబేడ్కర్ భవన్ చేరుకుంది. పాదయాత్ర ముగింపు సందర్భంగా జరిగిన ఊరేగింపు శ్రీకాకుళ పట్టణ వాసులను ఎంతో ముగ్ధులను చేసింది. లక్ష్మింపేట దళితుల డిమాండ్స్, పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టే విధంగా ఈ ప్రదర్శన సాగింది.

### శ్రీకాకుళంలో బహిరంగసభ

సభా కార్యక్రమానికి ముందు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ప్రదర్శన నిర్వహించారు. ముగింపుగా జరిగిన నిరసన సభకు కులనిర్మూలనా పోరాటసమితి జిల్లా బాధ్యులైన మిస్కా కృష్ణయ్య అధ్యక్షత వహించారు. సభ ప్రారంభానికి ముందు లక్ష్మింపేటపోరులో ప్రాణాలు కోల్పోయిన ఐదుగురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దళిత పోరాట సంఘీభావ కమిటీ కన్వీనర్ బొజ్జా తారకం మాట్లాడుతూ లక్ష్మింపేట ఘటనతో శ్రీకాకుళంజిల్లా పోరాట చరిత్రలో, మరో ఘట్టం మొదలవుతోందని చెప్పారు. లక్ష్మింపేటలో దళితుల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నామని, గ్రామంలోని 250 ఎకరాల భూమిని దళితులకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని పదే పదే అడుగుతున్నామన్నారు. లక్ష్మింపేటలో కాపులకు ఇళ్లు, ఉద్యోగం, మౌలిక సదుపాయాలు కల్పించారు.... అక్కడ ఉండే దళితులకు మాత్రం ఏమీ సమకూర్చలేదన్నారు. దళితులు ఇంతవరకు సాగుచేస్తున్న భూములనే దళితులకు పంచాలని, లక్ష్మింపేట గ్రామంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలనీ కోరారు. ఇది మా డిమాండ్ కాదు. మా హక్కు అని స్పష్టం చేశారు. తమ సమస్యలపై లక్ష్మింపేట దళితులంతా మంత్రి కోండ్రు మురళిని కలిస్తే 'చస్తే చావండి నా వల్ల కాదంటూ' చేతులెత్తేయడం చాలా దౌర్భాగ్యమన్నారు. ఈ విషయాన్ని గ్రామ దళితులే తమకు చెప్పి కన్నీరు పెట్టుకున్నారని తారకం చెప్పారు. దీనిపై మంత్రి కోండ్రును బహిరంగంగా అడగడానికి సిద్ధంగా ఉన్నామని తారకం అన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ సహకారం, అండదండలతోనే లక్ష్మింపేటలో హత్యలు జరిగాయన్నారు. లక్ష్మింపేటలో పోలీస్ అవుట్ పోస్టును కూడా ఎత్తేశారని ఆరోపించారు. 60 ఎకరాలు అడిగినందుకు ఎంతమందిని చంపేస్తారని సూటిగా ప్రశ్నించారు. మాల, మాదిగ, రెల్లి, దళితులకు రక్షణ ఇవ్వడం ప్రభుత్వానికి చేతకాకపోతే రాజ్యాంగ నిబంధనల ప్రకారం వారికి తుపాకులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దళిత పోరాట సంఘీభావ కమిటీ కో కన్వీనర్స్ దుడ్డు ప్రభాకర్, గెద్దం ఝాన్సి మాట్లాడుతూ లక్ష్మింపేటలో దళితులపై కాపులు పథకం ప్రకారం మారణకాండ సృష్టించారని అన్నారు. దళితుల భూమి దళితులకే చెందాలని, లక్ష్మింపేటలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని, మంత్రులు కోండ్రు, బొత్సలను బర్తరఫ్ చేయాలన్నారు. లక్ష్మింపేట ప్రాంతంలోని ఎస్ఐ, సిఐ, డీఎస్పీ మంత్రి కూడా దళితులే అయినప్పటికీ దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సకల జీవులనూ రక్షించాలని ప్రముఖులు, శాస్త్రవేత్తలు పదే పదే చెబుతూ జీవవైవిధ్య సదస్సులు నిర్వహిస్తున్నారు....కానీ దళితులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే ఏ ఒక్కరూ ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. దళితుల సమస్యలు నెరవేరాలంటే ఇంటికొక దళిత బిడ్డ ఉద్యమకారుడిగా తయారు కావాలన్నారు. లక్ష్మింపేట దళితుల సత్తా రాష్ట్రానికి తెలిసేలా మంత్రులకు, అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు.

ఎస్.ఝాన్సీ మాట్లాడుతూ ఈ జిల్లాలో '67లో భూమి కోసం, అడవి మీద హక్కు కోసం మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం జరిగిందని, గిరిజనుల భూమి సమస్యని,అటవీహక్కుల సమస్యలను పరిష్కరించాలంటూ జరిగిన ఈ పోరాటం దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఒక చరిత్రను నెలకొల్పిందన్నారు. 'ఈ పోరాట ఫలితంగా వచ్చిందే 1/70 చట్టం. ఈ పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో అనేక ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు సంఘాలను ఏర్పరచుకోవడం, భూమి సమస్య, అటవీ హక్కుల సమస్య, గిట్టుబాటు ధర సమస్యల్ని పరిష్కారం చేయాలంటూ ఉద్యమించడం, కొన్ని ఫలితాలను సాధించుకోవడం జరిగింది. ఈ రోజు లక్ష్మింపేటలో కూడా దళితులు 60 ఎకరాలు ప్రభుత్వ భూమి తాము సాగు చేసుకుంటున్నారు. ఈ భూమి వారికి వద్దని భూమి నుండి తరిమివేయడానికి 5గురిని హత్య చేశారు. 20 మంది కాళ్ళు, చేతులు విరగ్గొట్టారు. ఈ దాడి చేసిన ఈ కాపు పెత్తందారీ వర్గమే 1999లో మక్కువ మండలంలోని దుగ్గేరు ఏరియాలో మా రైతుకూలీసంఘం ప్రజలపైన, నాయకులపైనా దాడి చేసి మా జెన్ని తిరుపతిని హత్య చేశారు. ఈ కాపు పెత్తందారీ వర్గం, వలస వచ్చిన కమ్మ పెత్తందారులు మరియు స్థానిక పోలీసు అధికారులు కలిసి గిరిజనుల మీద దాడి చేసిన సంఘటనను ఈనాటికీ ఆ ప్రజలు మరువలేదు. భూమి అడుగుతున్న గిరిజనుల మీద, దళితుల మీద ఈ పెత్తందారీ వర్గం హంతక దాడులకు పూనుకోవడం దీని వర్గ స్వభావంలో భాగమే. కనుక ఈ దాడులకు స్వస్తి పలకాలంటే దళితులు, గిరిజనులు, అణగారిన పేదలంతా ఐక్యమై అగ్రకుల పెత్తందారీ వర్గాల దాడులను ఎదిరించటం తప్ప మరో మార్గం లేదు. ఆ వైపుగా దళితులను సంఘటిత పరచవలసిన కర్తవ్యం మన సంఘాల ముందు ఉంద'న్నారు.

ఇంకా ఈ సభలో ఉ. సాంబశివరావు, సి.భాస్కరరావు, తాండ్ర అరుణ (స్త్రీ విముక్తి సంఘటన), రాధ, (చైతన్య మహిళా సంఘం), కోటి (ప్రజా కళామండలి), చలసాని ప్రసాద్ (విరసం), సతీష్, (తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్), తదితరులు పాల్గొని ప్రసంగించారు.

✸

# లక్షింపేట దళిత బాధితులకు న్యాయం కోసం విజయవంతంగా సాగిన పాదయాత్ర




పాదయాత్ర అగ్రభాగంలో లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి నాయకులు; గ్రామాలగుండా సాగిన పాదయాత్ర దృశ్యం; ప్రజాకళాకారుల నృత్యం

**లక్షింపేట-శ్రీకాకుళం, అక్టోబరు 13-16 :**

2012 అక్టోబరు 13 నుంచి 16వ తేదీ వరకు సాగిన పాదయాత్ర గత రెండు దశాబ్దాల కాలంలో సాగిన ఆందోళన ప్రచార ఉద్యమాలలో కెల్లా విశిష్టమైనది. కామ్రేడ్స్ ఎర్రరంగు, భీమ్రేడ్స్ నీలిరంగు కలగలసి కష్టజీవుల, శ్రమజీవుల సంకేతంగా నడిచిన యాత్ర ఇది.

దోపిడీ వర్గాలకు దోపిడీ చేసుకోడానికి ఒక జాతి, ఒక మతము, కులము, ప్రాంతము, దేశము అనే హద్దులు లేవు. తమ దోపిడీకి ఆటంకం లేకుండా సాగడానికి సాధనంగా వైషమ్యాలను నిలిపి వుంచడం వారికి వెన్నతో బెట్టిన విద్య అన్న దృక్పథం కలిగిన శక్తుల సమైక్య యాత్రగా సాగింది.

దోపిడీ శక్తులకు మరియు దోపిడీకి వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న శక్తులు;

దోపిడీవర్గ వత్తాసుదారులకు మరియు దోపిడీకి వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న శక్తులు అన్న విభజన రేఖ గీసుకున్న శక్తుల ఐక్య యాత్రగా సాగింది.

కామ్రేడ్ బొజ్జా తారకం కన్వీనర్‌గా దళిత సమస్యపై ఉద్యమించాలనుకుంటున్న శక్తులన్నింటిని లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ ఏకత్రాటి పైకి తీసుకురాగలిగింది. మతమౌఢ్యం, మతం రుద్దిన సాంప్రదాయ బంధనాల నుంచి తాత్వికంగా విడగొట్టుకుని వాటిని ప్రతిఘటించి పురోగమన దిశలో వున్న శక్తుల ఐక్య యాత్రను విజయవంతంగా (లక్షింపేట దళిత సంఘీభావ పోరాట కమిటీ) నిర్వహించింది. చిన్న చిన్న సమస్యలు తలెత్తినా, భావపరమైన బేధాలు పొటమరించినా అందరినీ సంబాళించుకొని ముందుకు సాగడంలో కన్వీనర్ బొజ్జా తారకంగారు కృతకృత్యులయ్యారు. వారు అభినందనీయులు.

"దేశంలో నేటికీ అనేక ప్రాంతాలలో అంటరానితనం, కులవివక్ష-వివిధ రూపాలలో వెట్టి చాకిరీ వంటి అన్ని ఫ్యూడల్ అణచివేత పీడనలకు వ్యతిరేకంగా ఆధిపత్య కుల దురహంకార శక్తుల నుంచి విడగొట్టుకొని ఆధిపత్య కులాల్లోని పీడితులు, శ్రమజీవులయిన పేదలు, కులదురభిమానాలకు, కుల విద్వేషాలకు గురికాకుండా అణచివేతకు గురవుతున్న పీడిత కులాల్లోని పేదలతో చేయి కలిపి ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సి వుంది. ఫాసిస్టు తాత్విక భూమిక గల మత ఛాందసత్వాన్నుండి విముక్తి పొందవలసి వుంది. పీడిత వర్గ ఐక్యతకు, వారి పోరాటాలకు విశాల దృక్పథం, విశాల ప్రాతిపదిక ఏర్పడగలదు" అన్న దృక్పథాన్ని పెంపొందించవలసి వుంది. ఈ అవగాహనా ప్రాతిపదికగా రైతుకూలీ సంఘం, స్త్రీ విముక్తి సంఘటన, ప్రజాకళాకారులు, బాలసంఘ సభ్యులు, యువజన సంఘ కార్యకర్తలు అత్యంత క్రమశిక్షణతో ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు పాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో 13సం॥ బాలుడునుండి 94సం॥వృద్ధులవరకు పాల్గొనడం విశేషం.

లక్షింపేట దురంతం జరిగి నాలుగు నెలలు దాటినా సమస్య పరిష్కారం కాలేదు. బాధితులకు ఇవ్వాల్సిన 250 ఎకరాల భూమి కానీ, లక్షింపేటలోనే ఎస్‌సి, ఎస్‌టి, అత్యాచార నిరోధక చట్టం కింద ప్రత్యేక కోర్టు ఏర్పాటు కానీ జరగలేదు. బాధితుల ఈ న్యాయమైన డిమాండ్లను సాధించడానికి ప్రభుత్వం, ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నట్టు కనిపించటం లేదు. నిందితులకు అనుకూలంగా కోర్టును శ్రీకాకుళం పట్టణంలో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం 103 జీవో విడుదల చేసింది. ఆ జీవోను రద్దు చేయాలని లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ పోరాటం చేస్తూనే ఉంది. దారుణ మారణ సంఘటన జరిగిన గ్రామంలోనే ప్రత్యేక కోర్టు పెట్టాలని ఉన్న చట్టాన్ని కూడా అమలు పరచటానికి ఈ అగ్రకుల ఆధిపత్య వర్గానికి ప్రతినిధులుగా ఉన్న కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం అంగీకరించటం లేదు. లక్షల ఎకరాలు విడతలు విడతలుగా ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ చేస్తున్నామని ప్రగల్భాలు పలికే ప్రభుత్వం, సుదీర్ఘ పోరాటం చేస్తున్నప్పటికీ లక్షింపేట బాధితులకు 250 ఎకరాలు ఎందుకు ఇవ్వడం లేదు? ఈ రెండు డిమాండ్ల సాధన కోసం పోరాట కమిటీ అక్టోబరు 13 నుంచి 16 వరకు లక్షింపేట నుంచి శ్రీకాకుళంవరకు "దళిత ప్రజా నిరసన పాదయాత్ర" నిర్వహించింది. సంఘీభావ కమిటీ రాష్ట్ర కన్వీనర్ బొజ్జా తారకం సారధ్యంలో ఈ పాదయాత్ర జరిగింది. అక్టోబర్ 13న లక్షింపేట గ్రామంలో దళిత మృతవీరులు నివర్తి సంఘమేషు, నివర్తి వెంకట్, చిత్తడి అప్పుడు, బూరాడ సుందరరావు, బొద్దూరి పాపయ్యల సమాధుల వద్ద శ్రద్ధాంజలి ఘటించిన పిదప లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ శిబిరం నుంచి దాదాపు 500 పైచిలుకు కార్యకర్తలు, బాధితుల కుటుంబాల వాళ్లు, ఉదయం పదిన్నరకు పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర అగ్రభాగాన సంఘీభావ కమిటీ డిమాండ్ల బ్యానర్, వాటి వెనుక కమిటీ కన్వీనర్ బొజ్జా తారకం,

(తరువాయి 7వ పేజీలో)

# 'భూమి సమస్య భూమివద్దే తేలాలి'

## దొండపూడి దళిత, గిరిజన, పేదల ఇళ్ళస్థలాల పోరాట సంఘీభావ సభలో కా॥ ఇల్లా రామిరెడ్డి



దొండపూడి పేదల పోరాటానికి మద్దతుగా ప్రదర్శన; సంఘీభావ సభలో ప్రసంగిస్తున్న కా॥ ఇల్లా రామిరెడ్డి

**దొండపూడి, 20-9-12:** పశ్చిమగోదావరి జిల్లా, గోపాలపురం మండలం దొండపూడిలో దళిత, గిరిజన, పేదల ఇళ్ళస్థలాల సాధన కమిటీ సాగిస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఏజన్సీ గిరిజన సంఘం (రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) అనుబంధం) 20-9-2012న సంఘీంభావసభ నిర్వహించింది. సభకు ముందుగా దొండపూడి గ్రామంలో 1200 మంది దళిత, గిరిజన, పేదలు ప్రదర్శన నిర్వహించారు.

సంఘీభావ సభకు అధ్యక్షత వహించిన ఏజన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కామ్రేడ్ కుంజం రామారావు -గత రెండు సం॥లుగా దొండపూడి దళిత గిరిజన, పేదలు కమిటీగా ఏర్పడి పోరాటం సాగిస్తున్న క్రమాన్ని వివరించారు.

గిరిజన, గిరిజనేతర హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్రకన్వీనర్ కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఇళ్ళులేని పేదలు చారెడు నేల ఆక్రమిస్తేనే-ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం దాడులు చేస్తున్నాయని, పేదవాడికి కనీసం హక్కులేకుండా చేస్తున్నారన్నారు. పేదలకు, కష్టజీవులకు నివాస స్థలాలు లేకుండా చేస్తున్నారని, పందులతో సమానంగా జనం జీవిస్తున్నారనీ, ఇళ్ళస్థలాల కోసం 30 సం॥లుగా ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వాలు కపట ప్రేమను ఒలకబోస్తూ తరతరాలుగా వంచిస్తున్నదని, తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు, పోరాటాలు తప్ప ప్రజలకు వేరే మార్గం లేదని శతాబ్దాల చరిత్ర రుజువు చేస్తున్నదన్నారు. కులమత తారతమ్యం లేకుండా పేదలంతా ఐక్యమై పోరాడితే ఏదైనా సాధించవచ్చని, దొండపూడి దళితుల న్యాయమైన పోరాటాన్ని ప్రజలంతా బలపరచాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కా॥ జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ-దొండపూడిలో పేదలంతా ఐక్యమై, ఇళ్ళస్థలాలసాధనకు పూనుకోవడం మంచి పరిణామం అన్నారు. దశాబ్దాలుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం, గతిలేని స్థితిలో పేదలు ఇళ్ళస్థలాలు ఆక్రమించి, గుడిసెలు వేసుకొన్న వెంటనే నిస్సిగ్గుగా ప్రజలపైకి పోలీసుల్ని ఉసిగొల్పుతున్నాయని, ఈ విషయాల్ని దేశమంతా వెల్లడి చేయాలన్నారు.

బియస్‌పి జిల్లా అధ్యక్షులు కుంభా రంగారావుగారు మాట్లాడుతూ-దశాబ్దాలుగా ప్రజలు తమ కనీస అవసరాల కోసం విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోకుండా 'దున్నపోతుపై వానకురిసిన' చందంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, మన పోరాటాలతో భూస్వాముల, పెట్టుబడిదారుల మత్తు వదలగొట్టాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, అందుకు జిల్లా స్థాయిలో ఆందోళనలు విస్తృతపరచాలని, పేదలందరి సమస్యలపై కలిసికట్టుగా కదలాలని, అందుకు బి.ఎస్.పి. పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ మాదేపల్లి వెంకటరత్నం మాట్లాడుతూ ఇదే దొండపూడిలో దళితులు ఇళ్ళస్థలాలు, కాలనీ కోసం 80లలో సం॥ల తరబడి పోరాటం చేసి, జైళ్ళు, నిర్బంధాల్ని చవిచూసినాకనే అవి సాధించుకున్నారని గుర్తుచేశారు. అలాగే ఇప్పుడు మరలా పోరాటం చెయ్యాల్సి వుందన్నారు. పీడిత ప్రజల పక్షాన నిలిచే ఏజన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) దళిత, గిరిజన, పేదల ఇళ్ళస్థలాల సాధన కమిటీ సాధిస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇవ్వడంలో ముందు నిలుస్తుందన్నారు.

రైతు కూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కమిటి సభ్యులు కామ్రేడ్ ఎం.ఎస్. నాగరాజు మాట్లాడుతూ ఏజన్సీ గిరిజన సంఘం, గిరిజన, గిరిజనేతర పేదల ఐక్యతతో చేస్తున్న కృషి ఫలితంగానే దళితులు, గిరిజనులు, ఇతర పేదలలో చైతన్యం కలిగిస్తున్నదని, ఆ కృషిఫలితమే దొండపూడి రాజుంపాలెం పేదల ఇళ్ళస్థలాల సాధనకై సాధిస్తున్న ఆందోళన అని అన్నారు 40 సం॥లు ఖాళీగా ఉన్న భూమిలో పేదల ఇళ్ళ స్థలాలకై స్వాధీన పరచుకోవడం జరిగిందని, దీనితో పేదలను దౌర్జన్య కారులుగా, సంఘ వ్యతి రేకులుగా భూస్వాముల అనుకూలురు ప్రచారం చేస్తున్నారని, హైకోర్టులో తప్పుడు సర్వేనెంబర్లువేసి, భూస్వాములు అమ్ముకుంటున్న వాస్తవాల్ని కప్పిపెట్టి దొంగ (తప్పుడు) ఆర్డర్లు తెచ్చి, పేదల్ని ఆ భూములనుండి తక్షణమే ఖాళీ చేయించాలని కుట్రలు చేస్తున్నారని, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) పేదల న్యాయమైన పోరాటాల్ని బలపరుస్తూ అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తూనే ఉందన్నారు. గోపాలపురం మండలంలో ఇళ్ళస్థలాల సమస్య చాలా తీవ్రంగా ఉందని, అందుకై ప్రభుత్వాలు శ్రద్ధవహించి, పేదలకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవరకు పేదల హక్కుల్ని నిలబెట్టేందుకు, రక్షించుకోనేందుకు చైతన్యపరుస్తుందని, భూస్వాముల, దళారీల కుట్రలను సమర్ధవంతంగా త్రిప్పికొడతామన్నారు. నిర్బంధాల్ని సైతం ధిక్కరించి సాగుతున్న పేదల న్యాయమైన పోరాటాన్ని బలపరచవలసినదిగా ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఇంకా ఈ సభలో ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్ సవలం రాంబాబు, కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మెరిపో జాన్‌రాజు, మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి జిల్లా అధ్యక్షులు ఎం. రాజేశ్వరరావు, బి.ఎస్.పి. జిల్లా నాయకులు గుర్రాల భీమన్న తదితరులు దొండపూడి దళితులు, పేదలు ఇళ్ళస్థలాలకై చేస్తున్న ఆందోళనకు తమ పూర్తి మద్దతును తెలియచేశారు. ★

*Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*
*and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2*
*Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*